# పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 32 | విశాఖపట్నం | 2-11-2025 ఆదివారం | చీఫ్ ఎడిటర్ : ఎస్.ఎస్. రాజు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 32 | VISAKHAPATNAM | 2-11-2025 SUNDAY | CHIEF EDITOR: S.S. RAJU | Pages:8 | Rate: Rs.5/-



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.
అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.
ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9849349934




# కాశీబుగ్గలో తొక్కిసలాట
# 9 మంది మృతి

- ముగ్గురి పరిస్థితి విషమం
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- వెంకటేశ్వరస్వామి ఆలయంలో తొక్కిసలాట జరగడంతో ఈ ప్రమాదం
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మోడీ, చంద్రబాబు, పవన్, లోకేశ్, అనిత
- మృతుల కుటుంబాలకు రూ. 15 లక్షల చొప్పున ఆర్థిక సాయం
- గాయపడిన వారికి రూ. 3 లక్షల చొప్పున చికిత్స ఖర్చులు









**కాశీబుగ్గ, పతాకం న్యూస్:** శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో విషాదం చోటు చేసుకుంది. వెంకటేశ్వరస్వామి ఆలయంలో తొక్కిసలాట జరిగింది. ఘటనలో 9 మంది భక్తులు చనిపోయారు. మృతుల్లో 8 మంది మహిళలు, ఒక బాలుడు ఉన్నారు. పలువురు భక్తులు స్పృహతప్పి పడిపోయారు. వారిని కాశీబుగ్గలోని ఆస్పత్రికి తరలించారు. కాశీబుగ్గ చిన తిరుపతిగా పేరొందిన విజయ వెంకటేశ్వరస్వామి ఆలయానికి ఏకాదశి సందర్భంగా భారీగా భక్తులు వచ్చారు. ఈ క్రమంలో తొక్కిసలాట జరగడంతో ఏడుగురు భక్తులు చనిపోయారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో ఇద్దరు మృతి చెందారు. తొక్కిసలాటలో 13 మందికి గాయాలు కాగా వారికి ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. పలాస ఆస్పత్రిలో ఉన్నవారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. కాశీబుగ్గ ఆలయ తొక్కిసలాట ఘటనపై ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఇవాళ ఆలయానికి 15 వేల మంది భక్తులు వచ్చారని అధికారులు తెలిపారు. ప్రతి వారం 1500 నుంచి 2 వేల మంది భక్తులు దర్శనం కోసం వస్తారని హోంమంత్రి అనిత తెలిపారు. ఆలయం మొదటి అంతస్తులో ఉంటుందని అన్నారు. 20 మెట్లు ఎక్కి పైకి వెళ్లే క్రమంలో రెయిలింగ్ ఊడిపడిందని చెప్పారు. రెయిలింగ్ ఊడిపడటంతో ఒకరిపై ఒకరు పడి తొక్కిసలాట జరిగింది. తొక్కిసలాటలో భక్తులు మృతిచెందడం బాధాకరమని అనిత అన్నారు. తొక్కిసలాట ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించామన్నారు. గాయపడినవారికి ప్రాణాపాయం లేదని తెలుస్తోందని హోంమంత్రి తెలిపారు. ఆలయ నిర్వాహకుడు హరిముకుంద్‌పండాను కలెక్టర్, ఎస్పీ పిలిపించారు. ఆలయంలో హరిముకుంద్‌పండా నుంచి వివరాలు సేకరించారు.

మృతులు టెక్కలి మండలం రామేశ్వరం గ్రామానికి చెందిన ఏదూరి చిన్నమ్మి (50), టెక్కలి మండలం పిక్కసారి గ్రామానికి చెందిన రాపాక విజయ (48), వజ్రపుకొత్తూరు మండలం దుక్కవానిపేటకు చెందిన ఎం.నీలమ్మ (60), మందస మండలం బెల్లుపటియాకు చెందిన డి.రాజేశ్వరి (60), నందిగామ మండలం శివరామపురానికి చెందిన సి.యశోదమ్మ (56), మందస మండలం గుడిభద్రకు చెందిన రూప, కాశీబుగ్గ రోటరీనగర్‌కు చెందిన డొక్కడ అమ్ములు (55), మందసకు చెందిన బోర బృందావతి (60), సోంపేట మండలం బెంకిలి గ్రామానికి చెందిన లోళ్ల నిఖిల్ (12)గా గుర్తించారు.

బి.కళ, డి.కాంతమ్మ, సి.కాంతమ్మ, పి.నాగమ్మ, డి.భారతి, పి.సూరమ్మ, పి.గౌరి, ఆర్.రమాలక్ష్మి, జి.చిట్టెమ్మ, ఎస్.వెంకటమ్మ, పి.జయమ్మ, పి.సీతమ్మ, పి.నరసమ్మ, బి.మమత, బి.సరోజినమ్మ గాయపడ్డారు.

కాశీబుగ్గ తొక్కిసలాట ఘటనపై ప్రధాని నరేంద్ర మోడీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి (తరువాయి 2వ పేజీలో)

## పేదల జీవితాల్లో వెలుగులు తీసుకురావడమే
# కూటమి లక్ష్యం: చంద్రబాబు




**శ్రీ సత్యసాయి జిల్లా, పతాకం న్యూస్:** పేదల జీవితాల్లో వెలుగులు తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రజా సేవలో ప్రజల మనిషిగా ఉండాలనే ఉద్దేశంతోనే స్వయంగా లబ్ధిదారుల ఇంటికే వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. శ్రీ సత్యసాయి జిల్లా తలుపుల మండలం పెద్దన్నవారిపల్లెలో సీఎం చంద్రబాబు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రజావేదిక వద్ద నిర్వహించిన సభలో సీఎం ప్రసంగించారు. నిద్ర లేస్తే నేరుగా ఇంటికే పింఛన్లు వచ్చే విధంగా ఏర్పాట్లు చేసినట్లు సీఎం చెప్పారు. శ్రీ సత్యసాయి జిల్లా తలుపుల మండలం పెద్దన్నవారిపల్లెలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ చేశారు. మొదట వితంతు పింఛను పొందుతున్న మేడా రెడ్డమ్మకు పింఛను అందజేసిన ముఖ్యమంత్రి ఆమె బాగోగులు అడిగి తెలుసుకున్నారు. కోవిడ్? సమయంలో భర్త మృతి చెందిన తర్వాత ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నట్టు రెడ్డమ్మ ముఖ్యమంత్రికి తెలిపారు.

ప్రభుత్వం తరపున సంక్షేమ పథకాలను పొందుతున్నట్లు లబ్ధిదారు సీఎంకు చెప్పారు. అనంతరం తబలా కళాకారుడైన మల్లయ్యకు సీఎం పింఛను అందజేశారు. ఉపాధి కోసం ముగ్గురు కుమారులు బెంగళూరుకు వలస పోయినట్లు ఆయన చంద్రబాబు నాయుడుకు వివరించారు. వృద్ధాప్యంలో ఉన్న మల్లయ్యకు రెండు లక్షల (తరువాయి 2వ పేజీలో)



## కాశీబుగ్గ ఆలయ దుర్ఘటనపై అచ్చెన్నాయుడు, గౌతు శిరీషతో మాట్లాడిన మంత్రి నారా లోకేశ్

(2వ పేజీలో)



## కాశీబుగ్గ తొక్కిసలాటపై
# ప్రధాని మోడీ దిగ్భ్రాంతి
## రూ.2 లక్షల పరిహారం

2లో


పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..
అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..
పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

## నిరాశాజనకం


కేంద్ర గణాంకశాఖ తాజాగా విడుదల చేసిన సెప్టెంబర్ 30తో ముగిసిన తొలి అర్ధ సంవత్సరానికి సంబంధించిన పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపి) వివరాలు తీవ్ర నిరాశ కలిగిస్తున్నాయి. దీర్ఘకాల ధోరణులను అర్థం చేసుకునేందుకు పారిశ్రామిక ఉత్పత్తి గణాంకాలు దోహదం చేస్తాయి. ఈ గణాంకాల్లో అన్నీ ప్రతికూలం కాకపోయినా దృష్టి సారించాల్సిన అంశాలు మాత్రం చాలా ఉన్నాయి. ఆర్థిక సంవత్సరంలోని తొలి అర్ధభాగం (ఏప్రిల్ %-% సెప్టెంబర్ 2025) గణాంకాలను పరిశీలిస్తే, గత ఐదు సంవత్సరాలలో కనిష్ఠ స్థాయిలోనే పరిశ్రమల వృద్ధి నమోదైంది. కేవలం 3.2 శాతం మాత్రమే వృద్ధి నమోదవ్వడం ఆర్థికపరంగా ఆందోళన కలిగించే అంశం. సూచీలో కొలవబడిన 23 ప్రధాన తయారీ ఉపరంగాలలో సగానికి పైగా (అంటే ఎక్కువ భాగం) 2025 జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో క్షీణతను నమోదు చేశాయి. ముఖ్యంగా, కార్మిక ఆధారిత రంగాలు దుస్తులు, చర్మ ఉత్పత్తులు, రబ్బరు ఉత్పత్తులు, ప్లాస్టిక్ ఉత్పత్తులు ఇవన్నీ సెప్టెంబర్ 2025 త్రైమాసికంలో కుదించుకుపోయాయి. అమెరికా చేస్తున్న సుంకాల యుద్ధం ప్రభావంతో మన దేశం నుండి ఎగుమతుల తగ్గుదల పారిశ్రామిక ఉత్పత్తిపైనా ప్రతికూల ప్రభావం చూపిందని విదితమవుతోంది. భారతదేశ ఇంధన భద్రత, వ్యూహాత్మక ఖనిజ భద్రతను బలోపేతం చేయాలంటే గనుల రంగాన్ని పటిష్ఠం చేయడం అత్యవసరం. కానీ గత ఏడాది సెప్టెంబర్‌లో 0.2 శాతం పెరుగుదల నమోదుకాగా ఈ ఏడాది 0.45 శాతం కుంచించుకుపోవడం గమనార్హం. ఇదీ ప్రతికూల సూచనే కదా! అయితే మొదటి త్రైమాసికంలో 2 శాతం మాత్రమే ఉన్న వృద్ధి, రెండో త్రైమాసికంలో 4.1 శాతానికి చేరింది కనుక క్రమంగా మెరుగు పడుతుందని కొందరు భావించవచ్చు. కానీ ఈ మొత్తం పరిణామంలో కొద్దిగా మెరుగు అనిపిస్తున్న అంశం తయారీ (మాన్యుఫాక్చరింగ్) రంగం. త్రైమాసిక ప్రాతిపదికన చూస్తే, జూలై-సెప్టెంబర్ 2025 త్రైమాసికంలో తయారీ రంగం 4.9 శాతం వృద్ధి సాధించింది. ఇది 2023 డిసెంబర్‌లో ముగిసిన త్రైమాసికం తర్వాత నమోదైన అత్యధిక వృద్ధి రేటు. అర్ధ వార్షిక ప్రాతిపదికన కూడా ఈ రంగం కొంత పుంజుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరపు తొలి అర్ధభాగంలో 3.8 శాతానికి తగ్గిన వృద్ధి, 2025-26 ఆర్థిక సంవత్సరపు తొలి అర్ధభాగంలో (ఏప్రిల్-సెప్టెంబర్ 2025) మళ్లీ 4.1 శాతానికి చేరింది. తయారీ రంగం బలంగా కనిపిస్తున్న ఈ వృద్ధిని కూడా సూటిగా అర్థం చేసుకోవడం సరికాదు. గణాంకాలు చూపుతున్నదేమిటంటే ఈ వద్ధి విస్తృతంగా అన్ని రంగాలలో జరగడం లేదు. కొన్ని పరిమిత రంగాలలో మాత్రమే కేంద్రీకతమై ఉంది. వృద్ధి సాధించిన రంగాలు కొయ్య (వుడ్) ఉత్పత్తులు, ఖనిజ ఉత్పత్తులు, ప్రాథమిక లోహాలు, మరియు తయారుచేసిన లోహ ఉత్పత్తులు ఇవన్నీ అధిక పెట్టుబడి ఆధారిత రంగాలు. ఈ ధోరణి మాత్రమే కొనసాగితే, ఉపాధి సృష్టిపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే ఈ అంశంపై ప్రత్యేక దృష్టి అవసరం. ఇంకో ఆందోళనకరమైన విషయం ఏమిటంటే నాన్-డ్యూరబుల్ వినిమయ సరుకుల సూచీ వరుసగా ఆరు త్రైమాసికాలుగా క్షీణిస్తోంది. ఉప్పు, వంట నూనెలు వంటి నిత్యావసర సరుకులు కూడా ఇందులో ఉన్నాయంటే పరిస్థితి ఎలా దిగజారుతోందో బోధపడుతోంది. అంటే ఒకవైపు ఉపాధి అవకాశాలు తగ్గుతుండగా మరోవైపు వినిమయం తగ్గిపోతోంది. ఇదే క్రమం కొనసాగితే ప్రజల కొనుగోలు శక్తి లేక సరుకులకు డిమాండ్ మందగించడంతో వస్తూత్పత్తి క్రమంగా క్షీణిస్తోంది. అది మరింతగా ఉపాధిని దెబ్బ తీస్తుంది కనుక ఆర్థిక సంక్షోభం నానాటికీ తీవ్రమౌతోంది. పాలకులు అనుసరిస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాల దుష్ఫలితమిది. సాక్షాత్తూ కేంద్రప్రభుత్వ మంత్రిత్వ శాఖలు విడుదల చేసిన గణాంకాల అద్దంలో చూసుకొనియైనా ఏలినవారు తమ తప్పు తెలుసుకొని దిద్దుకోవాలి. ఈ స్థితిని మార్చడానికి నిజమైన పరిష్కారం ప్రజల ఆదాయాలను పెంచడం మరియు యువతకు కొత్త ఉద్యోగాలను సృష్టించడం మాత్రమే. ఆ దిశగా ప్రభుత్వ విధానాలు మార్చేందుకు ప్రజా ఉద్యమాలు పెంపొందాలి.

## హైదరాబాద్ మెట్రో రైలు ప్రయాణికులకు అలర్ట్.. రైలు ప్రయాణ వేళల్లో మార్పులు



**హైదరాబాద్, పతాకం న్యూస్:** హైదరాబాద్ మెట్రో రైలు ప్రయాణికులకు ఒక ముఖ్యమైన ప్రకటన వెలువడింది. ఈ నెల 3వ తేదీ నుంచి మెట్రో రైలు ప్రయాణ వేళల్లో మార్పులు చోటు చేసుకున్నాయని హైదరాబాద్ మెట్రో రైలు ఒక ప్రకటన ద్వారా తెలియజేసింది. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు అన్ని టెర్మినల్లలో, అన్ని రోజుల్లో ప్రయాణ సదుపాయం అందుబాటులో ఉంటుందని సంస్థ స్పష్టం చేసింది. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని యాజమాన్యం కోరింది. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ అధికంగా ఉండటం వలన ఉద్యోగులు, విద్యార్థులు మరియు నగరవాసులు మెట్రో రైలు ప్రయాణానికి ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ప్రయాణికులందరికీ అనుకూలంగా ఉండేలా ఎల్ అండ్ టీ మెట్రో రైలు ప్రయాణ వేళల్లో మార్పులు చేసింది.

## కాశీబుగ్గ తొక్కిసలాటపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి... రూ.2 లక్షల పరిహారం



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొక్కిసలాట జరిగి 9 మంది మరణించిన ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దురదృష్టకర సంఘటన అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపిన ప్రధాని, బాధితులకు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఈ ఘటనపై స్పందించిన ప్రధాని మోదీ, "ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట అత్యంత బాధాకరం. తమ సన్నిహితులను, కుటుంబసభ్యులను కోల్పోయిన వారికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను" అని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.అదేవిధంగా, ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి రూ. 2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గాయపడిన వారికి రూ. 50,000 ఆర్థిక సహాయం అందిస్తామని ప్రధాని కార్యాలయం వెల్లడించింది. ఆలయంలో జరిగిన ఈ విషాద ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

## 9 మంది మృతి

(మొదటిపేజీ తరువాయి)

తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని మోదీ తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు చొప్పున పరిహారాన్ని ఈ సందర్భంగా ప్రధాని ప్రకటించారు. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు స్పందించారు. కాశీబుగ్గ తొక్కిసలాట ఘటన కలచివేసిందని, దురదృష్టకర ఘటనలో భక్తుల మరణం అత్యంత విషాదకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాలని సూచించారు. తొక్కిసలాట ఘటన తీవ్రంగా కలచివేసిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. తొక్కిసలాటలో తొమ్మిది మంది మృతి చెందారని తెలిసి ఆవేదనకు లోనయ్యారు. ఈ విషాదకర ఘటనలో మృతి చెందినవారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులకు స్పష్టం చేశారు. సహాయక చర్యలు చేపట్టాలని జిల్లా అధికార యంత్రాంగానికి ప్రభుత్వం దిశానిర్దేశం చేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని, ప్రైవేట్ వ్యక్తుల నిర్వహణలో ఉన్న ఈ ఆలయంలో జరిగిన విషాదకర ఘటనపై విచారణ చేపడుతామన్నారు. కార్తీక మాసంలో శైవ క్షేత్రాలతోపాటు, ప్రముఖ ఆలయాలకు భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, క్యూ లైన్ల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని దేవాదాయ శాఖ అధికారులకు సూచించారు. మహిళలు, చిన్న పిల్లలు, వృద్ధులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆలయ ప్రాంగణాల్లో తగిన రక్షణ చర్యలు చేపట్టాలని, భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని అంచనాకు వచ్చినప్పుడు పోలీసు బందోబస్తుతోపాటు, మెడికల్ క్యాంప్స్ ఏర్పాటు చేయాలని పవన్ కల్యాణ్ సూచించారు.

## కూటమి లక్ష్యం: చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి)

రూపాయల ఆర్థిక సాయం అందజేయాలని రెవెన్యూ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. బీటెక్ పూర్తి చేసిన వృద్ధుడి మనవరాలు శివసే తేజకు ఉద్యోగం కల్పిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. "నేను నిద్ర లేచినప్పటి నుంచి మీ గురించే ఆలోచిస్తూ ఉంటాను. నా ఆలోచన అంతా ఒక్కటే, ఏ వ్యక్తికీ, ఏ కుటుంబానికీ ఇబ్బంది లేకుండా ఎలా మంచి చేయాలో చూస్తున్నాను. సంక్షేమ పథకాలు అందించాలి. అయితే అభివృద్ధి చేస్తేనే సంక్షేమ పథకాలకు డబ్బులు వస్తాయి. అందుకే నేను ప్రతి నెలా మొదటి తేదీన పేదల సేవలో కార్యక్రమం పెట్టాను. ప్రజాసేవలో ప్రజల మనిషిగా ఉండాలనే నేను మీ ముందుకు వస్తున్నాను. అప్పటి పాలనకు, ప్రస్తుత పాలనకు తేడా మీరే చూస్తున్నారు. గతంలో నాయకుడు హెలికాప్టర్‌లో వస్తే కింద చెట్లు నరికేసేవారు. పింఛన్లు ఇవ్వడానికి 2 లక్షల 62 వేల మంది వాలంటీర్లను పెట్టారు. ఈ రోజు మీరు చూస్తే నిద్ర లేచేసరికి మీకు పింఛన్లు వస్తున్నాయా లేదా అని అడుగుతున్నాను".అని చంద్రబాబు ప్రశ్నించారు. ప్రజావేదిక సభ వేదికగా కాశీబుగ్గ మృతులకు సంతాపంగా రెండు నిముషాల పాటు మౌనం పాటించారు.

## కాశీబుగ్గ ఆలయ దుర్ఘటనపై అచ్చెన్నాయుడు, గౌతు శిరీషతో మాట్లాడిన మంత్రి నారా లోకేశ్



**అమరావతి, పతాకం న్యూస్:** శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఏకాదశి పర్వదినాన తీవ్ర విషాదం చోటుచేసుకుంది. భక్తుల రద్దీ కారణంగా జరిగిన తొక్కిసలాటలో 9 మంది మృతి చెందగా, మరికొందరు గాయపడ్డారు. ఈ దురదృష్టకర ఘటనపై రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఏకాదశి రోజున ఇలాంటి ఘోరం జరగడం అత్యంత బాధాకరమని అన్నారు. ఈ ఘటన గురించి తెలిసిన వెంటనే తాను జిల్లా మంత్రి అచ్చెన్నాయుడు, స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీషతో ఫోన్‌లో మాట్లాడినట్లు లోకేశ్ తెలిపారు. బాధితులకు తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు. ప్రభుత్వం బాధితులకు అండగా నిలుస్తుందని, గాయపడిన వారికి అన్ని విధాలా నాణ్యమైన చికిత్స అందిస్తున్నామని స్పష్టం చేశారు. "కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయంలో తొక్కిసలాట జరిగి పలువురు భక్తులు మృతి చెందడం నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. మరణించిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను" అని లోకేశ్ పేర్కొన్నారు. పవిత్రమైన ఏకాదశి నాడు ఇలాంటి విషాదం నెలకొనడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సహాయక చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## కాశీబుగ్గ ఘటనకు కారకులపై కఠిన చర్యలు తీసుకుంటాం: చంద్రబాబు



**శ్రీ సత్యసాయి జిల్లా, పతాకం న్యూస్:** శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో జరిగిన తొక్కిసలాట ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి, ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు వ్యక్తుల బాధ్యతారాహిత్యం, నిర్లక్ష్యం కారణంగానే ఇంత పెద్ద ప్రాణనష్టం జరగడం అత్యంత బాధాకరమని అన్నారు. ఈ దుర్ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. శనివారం శ్రీ సత్యసాయి జిల్లా పెద్దన్నవారిపల్లిలో 'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు అందజేశారు. అనంతరం జరిగిన ప్రజావేదిక సభలో ఆయన మాట్లాడుతూ కాశీబుగ్గ ఘటనను ప్రస్తావించారు. అంత పెద్ద తుపానులో ముందస్తు ప్రణాళిక ద్వారా ఎక్కువ ప్రాణ నష్టం లేకుండా చూడగలిగామని... తీరా చూస్తే ఈరోజు ప్రైవేటు వ్యక్తుల బాధ్యతా రాహిత్య చర్యలతో ఇంత పెద్ద ప్రాణనష్టం జరిగిందని... ఇది అత్యంత బాధాకరమని అన్నారు. కాగా, ప్రజావేదిక సభ వేదికగా కాశీబుగ్గ మృతులకు సంతాపంగా రెండు నిముషాల పాటు మౌనం పాటించారు. ఆలయ నిర్వాహకులు ముందుగానే పోలీసులకు చెప్పి ఉంటే భక్తులను క్యూలైన్లలో నియంత్రించేందుకు అవకాశం ఉండేదని చంద్రబాబు అన్నారు. ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## కాఫీ ప్యాకెట్లలో రూ.47 కోట్ల విలువైన డ్రగ్స్... ముంబై ఎయిర్ పోర్టులో మహిళ అరెస్ట్




**ముంబై:** ముంబై విమానాశ్రయంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు భారీ డ్రగ్స్ రాకెట్‌ను ఛేదించారు. కొలంబో నుంచి వచ్చిన ఓ మహిళ వద్ద నుంచి సుమారు రూ. 47 కోట్ల విలువైన 4.7 కిలోల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కాఫీ ప్యాకెట్లలో అత్యంత చాకచక్యంగా దాచి తరలిస్తుండగా అధికారులు పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించి మహిళతో పాటు మొత్తం ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు డీఆర్ఐ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్దిష్ట సమాచారం మేరకు, కొలంబో నుంచి ముంబై విమానాశ్రయానికి చేరుకున్న మహిళను డీఆర్ఐ అధికారులు అడ్డుకున్నారు. ఆమె లగేజీని క్షుణ్ణంగా తనిఖీ చేయగా, కాఫీ ప్యాకెట్లలో దాచిన 9 పౌచ్‌లు బయటపడ్డాయి. వాటిని ప్రాథమికంగా పరీక్షించగా, అందులో ఉన్నది కొకైన్ అని నిర్ధారణ అయింది. వెంటనే రంగంలోకి దిగిన అధికారులు, ఈ డ్రగ్స్ తీసుకునేందుకు ఎయిర్‌పోర్ట్‌కు వచ్చిన మరో వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించి, ఈ రాకెట్‌కు ఫైనాన్స్, లాజిస్టిక్స్ సహకారం అందిస్తున్న మరో ముగ్గురిని కూడా అరెస్ట్ చేశారు. నిందితులందరిపై నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ చట్టం కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇటీవల కాలంలో అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాలు భారతీయ మహిళలను కొరియర్లుగా వాడుకుంటున్నాయని, ఆహార పదార్థాలలో డ్రగ్స్ దాచి రవాణా చేస్తూ కొత్త పంథాను ఎంచుకున్నాయని డీఆర్ఐ ఆందోళన వ్యక్తం చేసింది. గత నెలలో ఢిల్లీలో కూడా డీఆర్ఐ భారీ ఆపరేషన్ నిర్వహించి, 26 మంది విదేశీయులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 108.81 కోట్ల విలువైన హెరాయిన్, కొకైన్, యాంఫెటమైన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు గుర్తుచేశారు. ఈ స్మగ్లింగ్ వెనుక ఉన్న అంతర్జాతీయ నెట్‌వర్క్‌పై లోతైన దర్యాప్తు చేస్తున్నట్లు డీఆర్ఐ వెల్లడించింది.

# అగంపాడు గ్రామంలో శిధిలావస్థకు చేరిన పాఠశాల భవనం పరిశీలన



**పాడేరు, పతాకం న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు నియోజకవర్గం, జి. మడుగుల మండలం, బీరం పంచాయతీ,అగంపాడు గ్రామం పత్రిక ప్రకటన: అగంపాడు గ్రామం పర్యటనలో భాగంగా శిధిలావస్థకు చేరిన పాఠశాల భవనాన్ని పరిశీలించిన అనంతరం,జనసేన పార్టీ అధికార ప్రతినిధి శ్రీమతి బొంకుల. దివ్యలత కి బాధితులు అందించిన ఫిర్యాదుఇప్పటికే పలుమార్లు అధికారులకు పిర్యాదు చేసినట్లు సమాచారం అందిందని..అయినప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవడంతో మొంథా తుఫాను ప్రభావం వల్ల వర్షం కారణంగా బిల్డింగ్ పూర్తిగా కూలిపోయేలా ఉందనీ, దీనివల్ల పిల్లలకు ప్రమాదం జరుగుతుందని స్థానికులు వెల్లడించడం బాధాకరం అన్నారు... తక్షణమే విద్యాశాఖ అధికారులు స్పందించి ఈ పాఠశాల భవనాన్ని పునర్నిర్వించాలని కోరుచున్నామన్నారు... పాఠశాలలో సరైన సదుపాయాలు కల్పించి విద్యను అభ్యసించేలా ఉపాధ్యాయులను నిర్మించాలని, విద్యాశాఖ అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు... గ్రామస్తులకు భరోసా కల్పిస్తూ కూటమి ప్రభుత్వం పేద మధ్య తరగతి కుటుంబాలకు స్వచ్ఛమైన విద్యను అందించడంలో ముందుంటుందన్నారు.

## పెట్టుబడుల సదస్సుకు 3,000 మంది



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో భాగంగా నవంబరు 14, 15 తేదీల్లో నగరం వేదికగా జరగనున్న పెట్టుబడుల సదస్సు విజయవంతం అయ్యేలా విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సన్నాహాక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సదస్సుకు దేశ, విదేశాల నుంచి మూడు వేల మంది ప్రతినిధులు, ఇంకా రాయబారులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, వ్యాపార ప్రముఖులు హాజరవుతున్నారన్నారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో జరగనున్న వేదిక వద్ద చేయాల్సిన పనులపై అధికారులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఎయిర్‌పోర్టు, రైల్వేస్టేషన్‌ల వద్ద హెల్ప్ డెస్కులు పెట్టి అతిథులకు సంప్రదాయ కళాకారులతో స్వాగతం పలకాలన్నారు. నగర సుందరీకరణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, రోడ్లకు ఇరువైపులా పచ్చని మొక్కలు నాటాలన్నారు. రోడ్ల మరమ్మతులు పూర్తిచేయాలని, కార్యక్రమాల నిర్వహణ షెడ్యూల్ ఇతర వివరాలతో కూడిన హోర్డింగ్‌లు పెట్టాలని, అతిథులకు కాఫీ విత్ టేబుల్ బుక్స్, పర్యాటక ప్రాంతాల మాన్యువల్ పుస్తకాలు అందజేయాలన్నారు. ప్రధాన వేదిక వద్ద మొక్కలతో అలంకరించాలన్నారు. ప్రతినిధుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ సజావుగా సాగేలా సాంకేతికతను వినియోగించుకోవాలని, డెలిగేట్స్‌కు కిట్లు, పాస్‌లు జారీ, ప్రధాన సదస్సు, అనుబంధ సదస్సు, బ్రేక్ అవుట్ సెషన్ల నిర్వహణ విషయంలో ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశించారు. ఏయూ మైదానంలో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, ఉపరాష్ట్రపతి నేరుగా ల్యాండ్ అయ్యేలా హెలిప్యాడ్‌లు సిద్ధం చేయాలన్నారు. మంత్రులు, ఇతర ప్రముఖుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా వాహనాల పార్కింగ్, వసతి జాగ్రత్తగా పర్యవేక్షించాలన్నారు. సీఎం చంద్రబాబునాయుడు రెండు రోజులపాటు ప్రధాన వేదిక వద్ద ఉంటారని, అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. నిరంతరం విద్యుత్ ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. రెండు రోజుల సదస్సుకు వచ్చే అతిథులు పర్యాటక ప్రాంతాలు, ఆలయాల సందర్శనకు వెళ్లే అవకాశం ఉందని పేర్కొంటూ ఆయా ప్రాంతాల్లో అన్ని ఏర్పాట్లు ముందుగా చేపట్టాలన్నారు. కార్యక్రమాలకు జేసీ మయూర్ అశోక్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని, కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఉంటుందని పేర్కొంటూ అక్కడ నుంచి సహాయ సహకారాలు అందుతాయని చెప్పారు. సమావేశంలో జేసీ మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అర్హులైన వారందరికీ త్వరలోనే నూతన పింఛన్లు



**పెదగంట్యాడ, పతాకం న్యూస్:** గాజువాక నియోజకవర్గం 75 వ వార్డ్ పరిధి సీతానగరం, దుర్గవానిపాలెం గ్రామాల్లో పింఛను లబ్ధిదారులకి కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో పింఛన్లు ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మొల్లి పెంటిరాజు డైరెక్టర్ ఏపీ స్టేట్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ పాల్గొని మాట్లాడుతూ త్వరలోనే అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు ఇవ్వబడునని, ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లు అన్ని వర్గాల వారికి ప్రభుత్వ సహాయం అందుతుందని, ప్రజా సంక్షేమం పేద ప్రజలకు అండగా ఉండడం రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో 75వ వార్డు అధ్యక్ష, కార్యదర్శులు నమ్మి అప్పారావు, ములకలపల్లి పెంటయ్య, వార్డు క్లస్టర్ ఇంచార్జ్ ఉరుకూటి అప్పలరాజు, విశాఖ జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షుడు మొల్లి రమణబాబు, గాజువాక నియోజవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు వంగలపూడి అప్పలరాజు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బొంగురాజు, ఉరుకూటి అప్పారావు, కుమార్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల జీతాలు వచ్చేశాయ్



**గాజువాక, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మిస్సింగ్ జీతాలు జివిఎంసి కాంట్రాక్టు/ఔట్ సోర్సింగ్ పారిశుద్ధ్యం కార్మికుల అకౌంట్లో కొంతమందికి వచ్చాయి. మిగిలిన ఉన్న కార్మికులకు కూడా బకాయి మిస్సింగ్ జీతాలు పెట్టడం జరిగింది. అవి కూడా తొందర్లో వస్తాయని జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సిఐటియు గాజువాక జోన్ బాధ్యులు గొలగాని అప్పారావు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2025 సం డిసెంబర్ 31 తేది నుండి 2026 సం,.జనవరి 4వ తేది వరకు ఐదు రోజులపాటు ఆల్ ఇండియా సిఐటియు 18 వ మహాసభలు విశాఖ నగరంలో మొట్టమొదటిసారిగా నిర్వహిస్తున్నారు. కనుక సిఐటియు అన్ని రంగాల కార్మిక వర్గాన్ని ఐక్యం చేయాలన్నారు. నూతన 2026 సం,. 12వ పి.ఆర్.సి వేతనాలు బేసిక్, డి.ఏ, హెచ్.ఆర్.ఎ, మొదలగు సమాన వేతనాలు చెల్లింపు కొరకు పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాలన్నారు. కాంట్రాక్టు/ఔట్ సోర్సింగ్ కార్మికుల పనిగంటలు పెంపును వ్యతిరేకించడం, నాలుగు లేబర్ కోడ్స్ ను అడ్డుకోవడం, ప్రస్తుతం ఉన్న హక్కులను నిలబెట్టుకోవడం, కొత్త హక్కులను సాధించుకోవటం కొసం, రాబోయే రోజుల్లో చెయ్యబోయే పోరాటాలకు ఈ 18వ మహాసభ తీర్మానాలు ఎంతో అవసరం అని అన్నారు. నక్క నాగ రాజు, రాము, బాలరాజు, మీనాక్షి, కుమారి, సూర్యనారాయణ, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## జెన్ జాతీయ దివాస్ ఉత్సవాలు ప్రారంభం



**చింతపల్లి, పతాకం న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి ఏకలవ్య ఆదర్శ నివాస పాఠశాల యందు ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్ చేతుల మీదుగా జన్ జాతీయ దివాస్ ఉత్సవాలు శనివారం నుండి ప్రారంభమయ్యాయి. భగవాన్ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకొని జాతీయస్థాయిలో ప్రతి సంవత్సరం నవంబర్ 1 నుంచి 15 వరకు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా మన గిరిజనుల హక్కుల కోసం పోరాడిన భగవాన్ బిర్సా ముండా ని స్మరించుకొని విద్యార్థులలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్ మాట్లాడుతూ గిరిజనుల హక్కులకై పోరాటం చేసిన భగవాన్ బిర్సా ముండాను విద్యార్థిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏకలవ్య స్కూల్ ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు, స్కూల్ సెక్యూరిటీ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

### బల్క్ డ్రగ్ కంపెనీని ఆపి
## ప్రాణభిక్ష పెట్టండి : మత్స్యకారులు



**నక్కపల్లి, పతాకం న్యూస్:** బల్క్ డ్రగ్ కంపెనీని ఆపి ప్రాణభిక్ష పెట్టండి ' అంటూ శనివారం అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో మత్స్యకారులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఎం కేంద్ర కమిటీ నాయకులు కే.లోకనాథం, అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఎం.అప్పలరాజు, శంకర్ రావు, శ్రీరామ్, రాజేష్ పాల్గొన్నారు. మత్స్యకారుల జీవన విధానాన్ని, ఈ ప్రాంత ప్రజా శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటును నిలుపుదల చేయాలని కోరారు. ఇప్పటికే తీర ప్రాంతాల్లో రసాయన పరిశ్రమల ఏర్పాటుతో మత్స్య సంపద నశించి, మత్స్యకారులకు ఉపాధి భారమైందన్నారు. సముద్రంలో చేపల వేటతో జీవనం సాగిస్తున్న మత్స్యకారుల ఉపాధిని దూరం చేయొద్దని కోరారు.

## నూతన పెన్షన్లు ఎప్పుడు చంద్రన్నా?: అచ్యుతరావు



**గాజువాక, పతాకం న్యూస్:** కొత్త పెన్షన్లు మంజూరు కోసం అవ్వ తాతలు ఎదురుచూస్తున్నారని కూటమి ప్రభుత్వ అధికారం చేపట్టి 18 నెలలు గడుస్తున్న కొత్త పెన్షన్లు మంజూరు చేయలేదని సిపిఐ గాజువాక సమితి సభ్యులు కెంగువ అచ్యుతరావు ఆరోపించారు. శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీ లో కొత్త పెన్షన్ మంజూరు కోసం అవ్వ, తాతలు సచివాలయం చుట్టూ తిరుగుతున్నారు తప్ప కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నేటికీ కొత్త పెన్షన్లు ఒకటి కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. దీనివల్ల కొత్త పెన్షన్లు మంజూరు మంజూరు కోసం లబ్ధిదారులు ఎదురుచూపులు చూస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ అందించే పెన్షన్లు వారికి కొంత భరోసా ఇవ్వనుందని తెలిపారు. అటువంటి దివ్యాంగులు తొలగించిన పెన్షన్లు అప్పీల్ చేసుకునే అంతవరకు పెన్షన్లు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద కొత్త పెన్షన్లు మంజూరు చేసి అవ్వ తాతలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని కూటమి ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## పేదలకు ఆసరా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు



**పరవాడ, పతాకం న్యూస్:** గ్రేటర్ విశాఖ, 79వ వార్డు పరిధి లంకెలపాలెం, దేశపాత్రునిపాలెం, అగనంపూడి ఏరియాలలో స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి తిరిగి పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు ప్రతినెల 1వ తేదీన పెన్షన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టడం ఎంతో మందికి ఆసరాగా నిలుస్తుందిని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు కరణం జగదీష్, సింగిడి సింహాచలం, మచ్చ కుమార్, ప్రసాద్, కరణం అప్పారావు, శ్రీనివాసనగర్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## 87వ వార్డులో అర్హులందరికీ పెన్షన్ పంపిణీ

**గాజువాక, పతాకం న్యూస్:** అర్హులైనటువంటి లబ్ధిదారులకు స్వయంగా వారి ఇళ్లకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను అందజేయడం ఓ మంచి కార్యక్రమం అని పెన్షన్ పంపిణి కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాధం (జగన్) అన్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఒకటో తారీఖున అర్హులకు పెన్షన్ పంపిణీ చేయాలన్న మంచి ఆలోచనలో భాగంగా 87వ వార్డు పరిధిలో ఉదయం 06:00 గంటల నుండి సచివాలయం సిబ్బందితో లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేయడం వల్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేయడం జరిగింది అని అన్నారు.ఈ కార్యక్రమంలో మల్లా రాము, బొడ్డేటి సత్తిబాబు, కడుపుట్ల శ్రీను, బొడ్డేటి దేముళ్ళు, శ్రీను, సచివాలయం సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఉరుకూటి చందు చేతుల మీదుగా యాదవ సామాజిక భవనం ప్రారంభం



**గాజువాక, పతాకం న్యూస్:** గాజువాక నియోజకవర్గం పాత గాజువాక రామాలయం వద్ద గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన యాదవ సామాజిక భవన ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా వైయస్స్ ఆర్ సీపీ విశాఖ జిల్లా యూత్ అధ్యక్షులు మరియు 70 వార్డు కార్పొరేటర్ చందు ముఖ్యఅతిథిగా పాల్గొని భవనాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామ కమిటీ పెద్దలు చందు ని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు ఉరుకూటి అప్పారావు,ట్రెజరర్ గొలగాని అప్పారావు,సెక్రటరీ ఉరుకూటి బాబూరావు,ఉరుకూటి పైడిరాజు,పల్లా ఎల్లాజీ,ఉరుకూటి కనకరాజు,పల్లా అప్పారావు,ఉరుకూటి రాంబాబు,ఉరుకూటి శ్రీను,గొలగాని గోపీచంద్,ఉరుకూటి కృష్ణమూర్తి,మొల్లి శ్రీను,పీతల శ్రీను,గొలగాని శ్రీను,ఉరుకూటి మధు,పల్లా కుమార్ జీ,వియ్యపు చిన్నా,గొలగాని జీవి,బొట్టా ప్రకాష్,ఉరుకూటి కృష్ణ,వియ్యపు ఉమ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు



**పరవాడ, పతాకం న్యూస్:** పరవాడ మండలం, వాడచీపురుపల్లి, నాయుడుపాలెం గ్రామాలలో శనివారం నాడు గడప గడపకు వెళ్లి వయో వృద్ధులకు వికలాంగులకు వితంతువులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్ పంపిణీ కార్యక్రమంలో పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షన్ సొమ్మును ఇంటింటికి వెళ్లి అందజేసి, వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధికారి రమేష్ నాయుడు, సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ సభ్యులు మాసవరపు అప్పలనాయుడు, శాసనసభ్యులు సోదరులు పంచకర్ల ప్రసాదరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు బుగిడి రామ గోవింద్, సర్పంచులు కన్నూరు వెంకటరమణ, మోటారు సన్యాసినాయుడు, మండల ఉపాధ్యక్షులు వెన్నెల నరసింహారావు, నాయుడుపాలెం ఎంపీటీసీ సభ్యులు కొండ్రపు శ్రీరామమూర్తి, మాజీ ఎంపీటీసీ సభ్యులు లాలం ఈశ్వరరావు, కేఎన్ఆర్, వెలుగుల అనిల్ కుమార్, వర్రీ పరదేశి నాయుడు, పంది రాజు, పిల్ల శివకృష్ణ, నాగిరెడ్డి చిన్నారి, ఇందుల అశోక్, కూండ్రపు సన్ని బాబు, గురుసు శ్రీనివాస్ రెడ్డి, సారిపల్లి సతీష్, పావని, సతివాడ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

# తూర్పు నావికాదళ అధిపతిగా సంజయ్ భల్లా



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** తూర్పు నావికాదళ అధిపతి (కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్, కమాండింగ్ ఇన్ చీఫ్)గా సంజయ్ భల్లా శుక్రవారం విశాఖపట్నంలో జరిగిన కమాండ్ పరేడ్‌లో బాధ్యతలు స్వీకరించారు. రాజేష్ పెంధార్కర్ ఉద్యోగ విరమణ చేయడంతో సంజరు భల్లా ఆ బాధ్యతలు చేపట్టారు. తొలుత ఆయన నావికాదళ సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు. 1989 జనవరి 1న ఇండియన్ నేవీలో నియమించబడిన వైస్ అడ్మిరల్ సంజరు భల్లా 36 ఏళ్ల తన కెరీర్‌లో కమాండ్ స్టాఫ్ బాధ్యతలు నిర్వహించారు. ఆయన నావికాదళ ప్రధాన కార్యాలయంలో చీఫ్ ఆఫ్ పర్సనల్‌గా పనిచేశారు. గతంలో ఐఎన్ఎస్ నిశాంక్, ఐఎన్ఎస్ తారగిరి, ఐఎన్ఎస్ బియాస్ నౌకలలో బాధ్యతలు నిర్వహించారు. ఇస్లామాబాద్‌లోని హైకమిషన్ ఆఫ్ ఇండియాలో నావల్ అడ్వైజర్‌గా పనిచేశారు. ఆయన కాలంలోనే ప్రతిష్టాత్మకమైన ప్రెసిడెంట్స్ ఫ్లీట్ రివ్యూ (పిఆర్ఎఫ్ -%22), మిలాన్ 22 నిర్వహించారు. రాయల్ కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్ వంటి ప్రతిష్టాత్మక సంస్థల నుండి పట్టభద్రులైన ఆయన భారత ప్రభుత్వం నుండి అతి విశిష్ట సేవా పతకం, నౌ సేనా పతకాన్ని అందుకున్నారు.

# 'ఇంతమంది భక్తులు వస్తారని ఊహించలేదు' - తొక్కిసలాటపై స్పందించిన ఆలయ నిర్వాహకుడు



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటనపై ఆలయ నిర్వాహకుడు హరిముకుంద్‌పండా స్పందించారు. సాధారణంగా ఆలయానికి రెండు వేల మంది వరకు భక్తులు వస్తుంటారని, ఇంత పెద్ద సంఖ్యలో వస్తారని ఊహించలేదని తెలిపారు. "భక్తులకు ప్రసాద వితరణ చేసి పంపిస్తాను. ఇలా జరుగుతుందని ఊహించలేదు. ఇంత మంది వస్తారని తెలియక పోలీసులకు సమాచారం ఇవ్వలేదు" అని అన్నారు. ఆలయంలోనే హరిముకుంద్ పండాతో కలెక్టర్, ఎస్పీ మాట్లాడారు. అనంతరం బాధితులు చికిత్స పొందుతున్న ఆస్పత్రికి వెళ్లారు. ప్రస్తుతం ఆలయ పరిసరాలను పోలీసులు తమ అధీనంలోకి తీసుకున్నారు. ఆలయ ఆవరణలోనే హరిముకుంద్‌పండా కూడా ఉన్నారు. అయితే నాలుగేళ్ల క్రితం హరిముకుంద్ పండా అనే వ్యక్తి 12 ఎకరాల సొంత భూమిలో ఆలయాన్ని నిర్మించారు. సుమారు రూ.20 కోట్లతో ఆలయాన్ని నిర్మించారు. గతేడాది మేలో ఈ దేవస్థానంలో దర్శనాలు ప్రారంభం అయ్యాయి. ప్రతి శనివారం దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఆలయానికి హరిముకుంద్ పండా ధర్మకర్తగా ఉన్నారు. ప్రతి శనివారం భక్తులు భారీగా వస్తున్నా ఈ రోజు పెద్ద ఎత్తున భక్తులు వస్తారని నిర్వాహకులు అంచనా వేయలేదని తెలుస్తోంది. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో తీవ్ర విషాదం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. నేడు ఏకాదశి రోజున వెంకటేశ్వర స్వామి ఆలయంలో దర్శనానికి వెళ్లిన భక్తుల్లో తొమ్మిది మంది మృతి చెందారు. భారీగా భక్తులు రావడంతో తొక్కిసలాట జరిగి ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల్లో 8 మంది మహిళలు, ఒక బాలుడు ఉన్నారు. మరికొంతమంది భక్తులు స్పృహతప్పి పడిపోయారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వారిని రిమ్స్‌కు తరలించారు. మిగిలిన స్పృహతప్పి పడిపోయిన వారిని పలాస ఆస్పత్రికి తరలించారు. విజయ వెంకటేశ్వరస్వామి ఆలయానికి ఏకాదశి సందర్భంగా ఆలయానికి భారీగా భక్తులు వచ్చారు. సరైన నియంత్రణ, క్యూ లైన్ల నిర్వహణ లేకపోవడంతో భారీగా తరలివచ్చిన భక్తులు ఆలయం లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. లోపలికి వెళ్లే దారి నుంచి కాకుండా బయటికి వచ్చేందుకు ఉన్న దారిలో భక్తులు లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. తొక్కిసలాట జరగడంతో తొమ్మిది మంది భక్తులు చనిపోయారు. ఈ క్రమంలో ఇనుప రెయిలింగ్?ను పట్టుకుని వెళ్లే ప్రయత్నం చేశారు. అయితే రెయిలింగ్ ఊడిపడటంతో భక్తులు కిందికి పడిపోయినట్లు తెలుస్తోంది. అలా తొక్కిసలాట జరిగి ప్రమాదం జరిగినట్లు సమాచారం. ప్రస్తుతం ఘటనాస్థలిలో సహాయచర్యలు కొనసాగుతున్నాయి.

# మొంథా తుపాన్ కారణంగా నీట మునిగిన గ్రామం



**అడ్డతీగల, పతాకం న్యూస్ :** అల్లూరి సీత రామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్ చేనుపాకలు గ్రామం లో మొంథా తుపాన్ కారణంగా మా గ్రామం అంత నీటి తో మునిగిపోయిందని. అధికారులు వచ్చారు కొంత వరకు నీరు పోవడానికి డ్రైనేజీలాగా వర్క్ చెయించారు కానీ పూర్తిగా చెయలేదని ఎక్కడ నీరు అక్కడే ఉందని అధికారులు పట్టించుకోవాలని గ్రామస్తులు ఓతున్నారు.

# 1200 మత్స్యకార కుటుంబాలకు భరోసా కిట్లు అందజేసిన ఎమ్మెల్యే పల్లా



**గాజువాక, పతాకం న్యూస్:** జాతీయ విపత్తుల నుంచి ప్రజలను కాపాడటంలో అలుపెరుగని పాత్ర పోషించిన వ్యక్తిగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకే ఆ ఘనత దక్కుతుందని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, గాజువాక నియోజకవర్గ శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద మత్స్యకారుల భరోసా కిట్లు పంపిణీ మరియు తుఫాను బాధితుల పునరావాస బాధితులకు రేషన్ పంపిణీ ని శనివారం ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు.

మత్స్యకార భరోసా పంపిణీ కార్యక్రమంలో దిబ్బపాలెం మరియు గంగవరం లో చేపల వేట వల్ల నష్టపోయిన బాధిత కుటుంబాలకు పరిహారం అందజేయడం జరిగింది. రాష్ట్ర ప్రజల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో గాజువాక మండల రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, గాజువాక పౌరసరఫరాల అధికారి రవి, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్, జిల్లా లీగల్ సెల్ నాయకులు వెన్నెల ఈశ్వరరావు, నియోజకవర్గ నాయకులు అక్కిన లక్ష్మణరావు, బైపిల్లి గాంధీ, గోమాడ వాసు,బలగా బాలు నాయుడు, పోతిన వెంకటేశ్వరరావు, వియ్యపు నరేష్, ఆఫీజ్, దాట్ల శ్రీనివాసరాజు, దువ్వి శ్రీను, లక్కోజు దేవి,యజ్ఞప్రియ, వనజ, కత్తి తిలక్, రోయ విశ్వనాథం, శ్రీనివాస్ రెడ్డి, తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి అంగన్‌వాడీ కేంద్రం కూల్చివేత



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** పొందూరు మండలం కొంచాడలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి కూల్చివేశారు. నిర్మాణ శిథిలాలు కూడా తరలించి ఆనవాళ్లు లేకుండా చేశారు. గ్రామంలోని సర్వే నంబరు 45-22 ఎల్‌పిఎం నంబరు 953లో అంగన్‌వాడీ కేంద్రం ఉంది. దశాబ్దాలుగా వినియోగించిన ఈ కేంద్రం శిథిలావస్థకు చేరడంతో, 2023లో గ్రామంలోని ప్రైవేటు భవనంలోకి మార్చారు. శిథిలావస్థకు చేరిన ఈ భవనాన్ని తొలగించాలని ఐసిడిఎస్ అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు. ఈ ప్రాంతంలో నూతన అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇంతలో రాత్రికి రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. ఉదయం విధులకు వచ్చిన పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, విఆర్ఓ ప్రకాశరావు కూల్చివేసిన అంగన్‌వాడీ కేంద్రం ప్రాంతాన్ని పరిశీలించారు. గ్రామస్తులను ఆరా తీయగా ఎవరూ తెలీదని బదులిచ్చారు. ఈ ఘటనపై అధికారులు పొందూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వం: దివ్య లత



**పాడేరు, పతాకం న్యూస్:** జనసేన పార్టీ అధికార ప్రతినిధి బొంకుల దివ్యలత, మరియు జనసేన పార్టీ జీ.మాడుగుల మండల నాయకురాలు గండేరీ పార్వతమ్మ జీమాడుగుల మండలం అగం పాడు గ్రామంలో పర్యటించి తుఫాను బాధితులను పరామర్శించారు. మొంథా తుఫాను కారణంగా పంట నష్టపోయిన రైతులకు కూటమి ప్రభుత్వం అన్ని వేళలా అండగా ఉంటుందని జనసేన పార్టీ అధికార ప్రతినిధి బొంకుల దివ్యలత భరోసా ఇచ్చారు. జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గ్రామాల్లో తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు, గాలి వానల కారణంగా నేలకొరిగిన నీట మునిగిన పంట పొలాలను, కూలిపోయిన ఇళ్లను స్వయంగా పరిశీలించారు. తుఫాను ప్రభావం వల్ల నష్టపోయిన కుటుంబాలను పరామర్శించి వారికి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ అభిమానులు, కార్యకర్తలు, గ్రామస్తులు, బాధిత కుటుంబాలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.


# పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు, మహిళలకు చీరల పంపిణీ



**నాతవరం, పతాకం న్యూస్:** జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీర సూర్యచంద్ర ఆధ్వర్యంలో శనివారం నాతవరం జనసేన పార్టీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు, తుఫాన్ బాధిత మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ, జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. మొంథా తుఫాన్ సమయంలో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేసిన పారిశుధ్య కార్మికులకు కృతజ్ఞతగా దుప్పట్లు అందజేశామని చెప్పారు. తుఫాన్ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద మహిళలకు చీరలు పంపిణీ చేయడం ద్వారా వారికి కొంత సహాయం అందించామని వివరించారు. పేదల పట్ల జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పోలుపర్తి శ్రీనివాసరావు, వర్రే నరసింహ, మల్లాటి శ్రీను, గుడివాడ అశ్విన్ కుమార్, గుడివాడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలు అందించిన

# అధికారుల సేవకు సత్కారం




**పరవాడ, పతాకం న్యూస్:** పరవాడ మండలం, ముత్యాలంపాలెం పంచాయతీ పరిధిలో తీర ప్రాంతంలో ప్రజలకు మోంథా తుఫాన్ సమయంలో ఉత్తమ సేవలు అందించిన అధికారులను శనివారం ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు సత్కరించారు. ఈ మోంథా తుఫాన్ సమయంలో లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను తుఫాన్ పునరావాస కేంద్రాలకు తరలించి మూడు పూటలా భోజనం అందజేయడం, అలాగే తుఫాన్ అనంతరం దెబ్బతిన్న ఇళ్ళ వివరాలను సేకరించి అందజేయడం వంటి అంశాలలో ఉత్తమ సేవ కనబరిచారు. ఉత్తమ సేవలు అందించి, సత్కారం పొందిన వారిలో ప్రత్యేక అధికారి అనిత, ఎమ్మార్వో నాగరాజు, ఎంపీడీవో రమేష్ బాబు, ఆర్ఐ రమణ, సర్పంచ్ సుజాత ఉన్నారు. వీరందరూ తుఫాను సమయంలో విపత్కర పరిస్థితులను ఎదుర్కొని ఉత్తమ సేవలు అందించారని పంచకర్ల రమేష్ బాబు కొనియాడారు.

# పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఉత్సాహంగా దేశభక్తి గీతాల పోటీలు




**నర్సీపట్నం, పతాకం న్యూస్:** నర్సీపట్నంలో పిఆర్టియు ఆధ్వర్యంలో కొనసాగుతున్న బాలల ప్రతిభాపాటవ పోటీల్లో రెండో రోజు శనివారం దేశభక్తి గీతాల పోటీలు ఘనంగా నిర్వహించబడ్డాయి. విద్యార్థుల్లో దేశభక్తి, సంగీత నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ పోటీలు నిర్వహించినట్లు పిఆర్టీయు జిల్లా అధ్యక్షులు డి.గోపినాథ్ తెలిపారు. జూనియర్స్ (4, 5, 6, 7వ తరగతులు), సీనియర్స్ (8, 9, 10వ తరగతులు)గా విభజించి పోటీలు నిర్వహించగా, రెండు విభాగాల్లో కలిపి 100 బృందాలు పాల్గొన్నాయి. పలువురు విద్యార్థులు దేశభక్తి గీతాలను హృద్యంగా ఆలపించి ప్రేక్షకుల హృదయాలను తాకారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా శాంతా లక్ష్మి, వరలక్ష్మి, సంఘమిత్ర లు బాధ్యతలు నిర్వర్తించారు. విద్యార్థుల ప్రతిభను ప్రశంసించిన వారు, ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో దేశభక్తి భావాన్ని మరింత బలపరుస్తాయని అభిప్రాయపడ్డారు. నర్సీపట్నం తో పాటు పరిసర మండలాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొనడం విశేషం.

# కిటకిటలాడిన వెంకన్న ఆలయం



**నక్కపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఉపమాక గ్రామంలో గరుడాద్రి పర్వతముపై స్వయం వ్యక్తంగా వేంచేసియున్న శ్రీ కల్కి వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం నాడు వేలాది మంది భక్తుల గోవింద నామ స్మరణలతో మారుమ్రోగింది. కార్తీకమాసం శనివారం రోజున ఏకాదశి కూడా కలసి రావడంతో సుదూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఈ సందర్భంగా తెల్లవారుఝామున ఐదు గంటలకు కొండపై గల మూలవిరాట్టు కు అర్చకులు అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించిన తరువాత భక్తులందరికీ దర్శన సౌకర్యం ఏర్పాటు చేశారు. కొండ దిగువన ఆలయంలో ఆలయ క్షేత్ర పాలకుడు నారద మహర్షి ప్రతిష్టితమైన వేణుగోపాల స్వామి వారికి మరియు ఉపాలయాలలోనూ నిత్యపూజలు, విశేష ప్రసాద నివేదనలు నిర్వహించిన తర్వాత భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించారు.ఉత్తరాంధ్ర తిరుమల గా పేరొందిన ఉపమాక వెంకన్న ను దర్శించుకోవడం కోసం శ్రీకాకుళం జిల్లా మందస, పలాస, ఉభయ గోదావరి జిల్లాల్లో గల వివిధ ప్రాంతాల నుండి వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.కొండపైన ధ్వజస్తంభం వద్ద మెట్ల మార్గంలోనూ భక్తులు దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.వందలాది వాహనాలు రావడంతో ఆలయం బయట ఉన్న పార్కింగ్ స్థలం నిండిపోవడతో ట్రాఫిక్ సమస్య ఏర్పడడంతో నక్కపల్లి పోలీసులు పరిస్థితిని వెంటనే చక్కదిద్దారు. దర్శనానికి వచ్చిన భక్తుల సంఖ్య పెరగడతో క్యూలైన్ భారీగా పెరిగి దేవాలయం బయట ఉన్న ఖాళీస్థలం వరకూ భక్తులతో రద్దీగా కనిపించింది.

## ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం.. నిందితుల ఆస్తుల స్వాధీనానికి కోర్టు సమ్మతి




**విజయవాడ, పతాకం న్యూస్:** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మద్యం ముడుపుల (ఏపీ లిక్కర్ స్కామ్) కేసులో దర్యాప్తు సంస్థలకు కీలక ముందడుగు లభించింది. ఈ కేసులో నిందితులు అక్రమంగా సంపాదించిన ఆస్తులను అటాచ్ చేసేందుకు విజయవాడ ఏసీబీ కోర్టు అనుమతులు జారీ చేసింది. గతంలో ప్రభుత్వం జారీ చేసిన జీవో 111, 126ల ప్రకారం ఆస్తుల జప్తునకు అనుమతించాలని కోరుతూ సిట్ అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది. కోర్టు అనుమతితో కోట్ల రూపాయల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు సిట్ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమ మద్యం అమ్మకాల ద్వారా వచ్చిన ముడుపులతో ప్రధాన నిందితుడు (ఏ1) రాజ్ కెసిరెడ్డి భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది. తన కుటుంబ సభ్యులు, బంధువుల పేరిట పలుచోట్ల ఆస్తులు కొనుగోలు చేసినట్లు పక్కా ఆధారాలను అధికారులు సేకరించారు. ఈ అక్రమ సంపాదనతో రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దామెరపల్లె, మాచన్‌పల్లి గ్రామాల పరిధిలో రాజ్ కెసిరెడ్డి తన పేరు మీద 27.06 ఎకరాల భూమిని కొనుగోలు చేసినట్లు డాక్యుమెంట్ల ద్వారా గుర్తించారు. అదే ప్రాంతంలో తన తల్లి కెసిరెడ్డి సుభాషిణి పేరు మీద మరో 3.14 ఎకరాల వ్యవసాయ భూమిని కొన్నట్లు తేలింది. ఈ మొత్తం 30.20 ఎకరాల భూమిని జప్తు చేసేందుకు ప్రభుత్వం గతంలోనే సీఐడీకి అధికారం ఇచ్చింది. వీటితో పాటు, రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి పరిధిలోని గచ్చిబౌలిలో రూ.1.46 కోట్ల విలువైన 326 గజాల స్థలాన్ని కొనుగోలు చేసినట్లు సీఐడీ నిర్ధారించింది. మాచన్‌పల్లి గ్రామంలో తన కంపెనీతో పాటు తల్లి పేరు మీద మరో 100 ఎకరాల భూమిని కొనుగోలు చేసినట్లు అధికారులు గుర్తించారు. తాజా కోర్టు ఉత్తర్వులతో ఈ ఆస్తులన్నింటినీ జప్తు చేసే ప్రక్రియను సిట్ అధికారులు ప్రారంభించనున్నారు.

## బీజేపీ, జేడీయూలను ఓడించండి: ప్రియాంక గాంధీ



**బీహార్:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి విజయం సాధిస్తుందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ ప్రియాంక గాంధీ ధీమా వ్యక్తం చేశారు. బీహార్‌లో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించడానికి ముందు ఆమె పాట్నా విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతూ, ఎన్డీయే కూటమి ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయలేదని విమర్శించారు. ఎన్డీయే ప్రభుత్వం కోటి ఉద్యోగాల హామీ గురించి మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, ఇన్నేళ్లు అధికారంలో ఉండి ఎందుకు నెరవేర్చలేదని ఆమె బీజేపీ, జేడీయూలను నిలదీశారు. ఎన్నికల్లో గెలుపొందేందుకు ఎన్డీయే ప్రభుత్వం విభజన రాజకీయాలకు పాల్పడుతోందని ప్రియాంక గాంధీ ఆరోపించారు. బెగుసరాయ్‌లో తన తొలి ప్రచార సభలో ఆమె మాట్లాడుతూ, బీజేపీ నకిలీ జాతీయవాదాన్ని ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించలేక ఓట్ల చోరీకి పాల్పడుతోందని ధ్వజమెత్తారు. ఓట్ల తొలగింపు అనేది హక్కుల ఉల్లంఘనతో సమానమని ఆమె వ్యాఖ్యానించారు. దేశాభివృద్ధికి బీహార్ ఎంతో తోడ్పడిందని, కానీ రాష్ట్రాభివృద్ధి విషయంలో మాత్రం వెనుకబడి ఉందని ఆమె అన్నారు. బీజేపీ నాయకులు నిత్యం గతం, భవిష్యత్తు గురించే మాట్లాడుతున్నారని, ప్రస్తుతం గురించి మాత్రం మాట్లాడటం లేదని విమర్శించారు. నెహ్రూ, ఇందిరాగాంధీలను విమర్శిస్తున్నారే తప్ప నిరుద్యోగం, వలసల గురించి పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. విభజన రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. బీహార్‌లో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం లేదని, ప్రతిదీ ఢిల్లీ నుంచి నియంత్రిస్తారని ప్రియాంక గాంధీ అన్నారు. ఎన్డీయే పాలనలో పెద్ద ఎత్తున ప్రైవేటీకరణ జరుగుతోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొద్దిమందికే అప్పగించారని ఆరోపించారు.

## వాలీబాల్ ఆడిన నారా భువనేశ్వరి



**హైదరాబాద్, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అర్ధాంగి నారా భువనేశ్వరి విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆడారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ పాఠశాలలో ఆమె విద్యార్థులతో సరదాగా గడిపారు. రెండు జట్ల మధ్య మ్యాచ్ కోసం టాస్ వేశారు. అనంతరం విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఆ తర్వాత వారితో కలిసి ఉత్సాహంగా వాలీబాల్ ఆడారు. హైదరాబాద్ సమీపంలోని మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్‌లో ఉన్న ఎన్టీఆర్ కుటీరంలో మూడు రోజుల పాటు జరిగే ఎన్టీఆర్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఫెస్ట్ పోటీలు ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భువనేశ్వరి జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్టీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్‌గా కాకుండా ఒక అమ్మలాంటి వ్యక్తిగా వ్యవహరిస్తున్నానని అన్నారు. తమ ట్రస్ట్ సంపద కోసం కాకుండా విద్యార్థుల భవిష్యత్తు కోసం పాటుపడుతోందని తెలిపారు. దేశానికి సేవ చేసే పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుకునే సమయంలోనే జీవితంపై అవగాహన పెంచుకుని ముందుకు సాగాలని సూచించారు.

# బాధిత రైతులకు పంటల బీమా ప్రశ్నార్థకం?



**అమరావతి, పతాకం న్యూస్:** పంటల బీమాకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడబలుక్కొని గండి కొట్టాయి. మోడీ సర్కార్ క్రాప్ ఇన్సూరెన్సు్ను రైతుల అభీష్టానికే (ఐచ్ఛికం) వదిలేయగా, టిడిపి కూటమి ప్రభుత్వం అంతకు ముందు వరకు ఉన్న ఉచిత పంటల బీమాను ఎత్తేసి రైతులే తమ వాటా ప్రీమియాన్ని చెల్లించుకోవాలని చెప్పింది. 'డబుల్ 'ఇంజిన్' సర్కార్ విధానం మొంథా తుపాన్ సృష్టించిన విలయానికి లక్షల ఎకరాల్లో పంట నష్టాలను చవిచూసిన రైతులకు అందాల్సిన కొద్దిపాటి బీమాకు దూరం చేసింది. ఖరీఫ్లో వ్యవసాయ, ఉద్యానవన పంటలన్నీ కలుపుకొని కోటి ఎకరాలకు పైగా రైతులు సాగు చేయగా అక్టోబర్ చివరాఖరుకు దిగుబడి ఆధారిత (ఫసల్), వాతావరణ ఆధారిత.. రెండు బీమా పథకాల్లో చేరిన విస్తీర్ణం 19.57 లక్షల ఎకరాలు మాత్రమే. తమ పంటలకు ఇన్సూరెన్స్ చేయించుకున్న రైతులు సుమారు ఏడున్నర లక్షల మంది. నిరుడు ఖరీఫ్లో రెండు బీమా పథకాలూ కలిపి 71 లక్షల ఎకరాలు బీమా కిందికి వచ్చాయి. దాదాపు 32 లక్షల మంది రైతులు తమ పంటలకు బీమా చేయించుకున్నారు. గత ఖరీఫ్ కంటే ఈ ఖరీఫ్ లో భారీగా బీమా చేయించిన విస్తీర్ణం, రైతుల సంఖ్య తగ్గడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్వాకమే కారణం సమగ్రం అన్నారు! కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో తాము అధికారంలోకొస్తే రైతులు, కౌలు రైతులందరినీ ఆదుకునేలా సమగ్ర పంటల బీమా తీసుకొస్తామని హామీ ఇచ్చింది. తర్జన భర్జనల అనంతరం వైసిపి హయాంలో మోడీ సర్కార్ ఒత్తిడితో ప్రవేశపెట్టిన కేంద్ర పథకాలకే జై కొట్టింది. అప్పటి వరకు రైతులు చెల్లించాల్సిన ప్రీమియాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లించగా, ఆ విధానానికి స్వస్తి పలికి రైతులనే కట్టుకోమంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం బీమాను రైతుల ఇష్టాయిష్టాలకే వదిలేసింది. అంతకుముందు వరకు బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకునే రైతులకు బీమా తప్పనిసరి. బ్యాంకులే ఆ పని చేసేవి. మోడీ ప్రభుత్వం ఆ విధానాన్ని ఎత్తేసింది. రైతులు తమ సమ్మతి తెలిపితేనే బ్యాంకులు పంటలకు బీమా చేయాలంది. తామే ప్రీమియం కట్టుకోవాల్సి రావడంతో, అసలే సాగు గిట్టుబాటుకాక ఆర్థిక సంక్షోభంలో ఉన్న రైతులు, కౌలు రైతులు బీమా జోలికి వెళ్లడానికి సాహసించలేదు. 2025 ఖరీఫ్లో ఫసల్ బీమా కోసం నోటిఫై చేసిన 26 జిల్లాల్లో కొన్ని పంటలను ఎంపిక చేశారు. సీజన్ ముగిసే సమయానికి రైతుల నుంచి 12 లక్షల వరకు దరఖాస్తులందాయి. వాటిలో 4.52 లక్షల మంది రైతులు తమ వాటా ప్రీమియాన్ని చెల్లించి బీమా పథకంలో చేరారు. వాతావరణ ఆధారిత బీమా కోసం 20 జిల్లాలను నోటిఫై చేయగా 7.30 లక్షల మంది రైతుల నుంచి దరఖాస్తులందాయి. వారిలో 3 లక్షల మంది తమ వాటా ప్రీమియం చెల్లించి 11.17 లక్షల ఎకరాలకు బీమా చేయించుకున్నారు. కేంద్రం నిధులివ్వలేదు 2024 ఖరీఫ్ సమయంలో 'డబుల్ ఇంజిన్' సర్కారే అధికారంలో ఉంది. సీజన్ ముగిసి ఏడాదవుతున్నా ఫసల్ బీమా ప్రీమియంలో కేంద్రం తన వాటాగా చెల్లించాల్సిన నిధులివ్వకుండా పెండింగ్ పెట్టింది. రైతులు తమ వాటా కింద రూ.60.19 లక్షలు చెల్లించగా, రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద రూ.304 కోట్లు చెల్లించింది. కేంద్రం తన వాటా కింద రూ.304 కోట్లు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.50 కోట్లే ఇచ్చింది. ఇన్సూరెన్స్ కంపెనీలకు ఫసల్ బీమా కింద రూ.355.95 కోట్లు ప్రీమియం చెల్లించగా, ఇప్పటి వరకు 82,320 మంది రైతులకు రూ.8.53 కోట్లు మాత్రమే పరిహారం సెటిల్ చేశాయి. 2024 ఖరీఫ్లో వాతావరణ ఆధారిత బీమా కింద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూ.739 కోట్లు ఇన్సూరెన్స్ కంపెనీలకు చెల్లించగా ఇప్పటి వరకు రైతులకు ఒక్క రూపాయి పరిహారం రాలేదు. కేంద్రం తన వాటా ప్రీమియం నిధులు ఇవ్వకపోయినా, ఇన్సూరెన్స్ కంపెనీలు రైతులకు క్లెయిములు పరిష్కారం చేయకపోయినా టిడిపి కూటమి సర్కార్ గమ్మునుంది. నిరుడు బుడమేరు వరదలు, భారీ వర్షాలు, కరువు వచ్చినా రైతులకు బీమా ఆసరా కాలేదు. ఉచిత బీమా ఉన్నప్పుడే పరిస్థితి అంత దారుణంగా ఉంటే, ఉచిత బీమా లేని ఈ ఖరీఫ్ మొంథా, ఇతర విపత్తుల బాధిత రైతులకు బీమా పరిస్థితి మరింత దారుణంగా తయారైంది.

## పండగ సీజన్‌లో కళకళలాడిన జీఎస్టీ వసూళ్లు...
# అక్టోబరులో రూ. 1.96 లక్షల కోట్ల ఆదాయం




**ముంబై:** దేశంలో పండగ సీజన్ వేళ వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు మరోసారి రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. అక్టోబరు నెలలో జీఎస్టీ ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ. 1.96 లక్షల కోట్ల ఆదాయం సమకూరింది. గతేడాది ఇదే నెలతో పోలిస్తే ఇది 4.6 శాతం అధికమని శనివారం విడుదలైన అధికారిక గణాంకాలు వెల్లడించాయి.వరుసగా పదో నెలలో కూడా జీఎస్టీ వసూళ్లు రూ. 1.8 లక్షల కోట్ల మార్కును దాటడం గమనార్హం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–అక్టోబరు మధ్య కాలంలో జీఎస్టీ వసూళ్లు 9 శాతం పెరిగి రూ. 13.89 లక్షల కోట్లకు చేరాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఈ మొత్తం రూ. 12.74 లక్షల కోట్లుగా ఉంది. రీఫండ్‌లను మినహాయించిన తర్వాత, అక్టోబరులో నికర పన్ను వసూళ్లు రూ. 1.69 లక్షల కోట్లుగా నిలిచాయి.

సెప్టెంబరు 22న చేపట్టిన రేట్ల హేతుబద్ధీకరణ తర్వాత పండగ సీజన్‌లో వినియోగదారుల నుంచి బలమైన డిమాండ్ కనిపించిందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించడం వల్లే ఇది సాధ్యమైందని ప్రభుత్వం పేర్కొంది. ఈ ఏడాది వినియోగం 10 శాతానికి పైగా పెరిగే అవకాశం ఉందని, దీనివల్ల అదనంగా రూ. 20 లక్షల కోట్ల మేర కొనుగోళ్లు జరగవచ్చని అంచనా వేస్తున్నారు.

"పండగ సీజన్‌లో బలమైన డిమాండ్, మెరుగైన పన్ను విధానం, పెరుగుతున్న వినియోగం, సమ్మతి వంటివి అధిక జీఎస్టీ వసూళ్లకు కారణం. వినియోగం, పన్ను చెల్లింపులు సరైన దిశలో పయనిస్తున్నాయనడానికి ఇది ఒక సానుకూల సూచిక" అని కేపీఎంజీ ఇండియా భాగస్వామి అభిషేక్ జైన్ అన్నారు.

మరోవైపు, ప్రత్యక్ష పన్నుల వసూళ్లలోనూ ఇదే తరహా వృద్ధి కనిపించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అక్టోబరు 12 నాటికి నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు 6.33 శాతం పెరిగి రూ. 11.89 లక్షల కోట్లకు చేరాయి. కార్పొరేట్ పన్ను వసూళ్లు రూ. 5.02 లక్షల కోట్లకు, వ్యక్తిగత పన్ను వసూళ్లు రూ. 6.56 లక్షల కోట్లకు పెరిగినట్లు ఆదాయపు పన్ను శాఖ తెలిపింది.

# తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావాలి: రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, పతాకం న్యూస్:** తెలంగాణలో పెట్టుబడులుపెట్టడానికి ముందుకు రావాలని కెనడా ప్రతినిధులని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డితో హైకమిషనర్ ఆఫ్ కెనడా టు ఇండియా క్రిస్టోఫర్ కూటర్ బృందం సభ్యులు సమావేశం అయ్యారు. ఈ భేటీలో ఐటీ, ఫార్మా, ఎయిర్‌స్పేస్, డిఫెన్స్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో కెనడాతో భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంపై చర్చించారు సీఎం రేవంత్‌రెడ్డి. ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను కెనడా హైకమిషనర్‌కు వివరించారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని కెనడా హైకమిషనర్‌కి సీఎం విజ్ఞప్తి చేశారు. స్టార్టప్స్, ఎడ్యుకేషన్, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్‌లోనూ పెట్టుబడుల పెట్టడానికి ముందుకు రావాలని సీఎం సూచించారు. ఈ సమావేశంలో కెనడా మినిస్టర్ ఎడ్ జాగర్ (ట్రేడ్ కమిషనర్ విక్రమ్ జైన్, కారెన్), తెలంగాణ ప్రభుత్వ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, విష్ణువర్ధన్ రెడ్డి, అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.అలాగే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఫ్రాన్స్ కాన్సులెట్ జనరల్ మార్క్ లామీ బృందం మర్యాదపూర్వకంగా సమావేశం అయ్యారు. ఈ



భేటీలో హైదరాబాద్‌లో ఫ్రాన్స్ ఆన్ గోయింగ్ ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిపై చర్చించారు. హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఫ్రాన్స్ బృంద సభ్యులని సీఎం కోరారు. హైదరాబాద్‌లో ఫ్రెంచ్ బ్యూరో కార్యాలయాన్ని మరింత బలోపేతం చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు.

ఈ సమావేశంలో మౌద్ మిక్వా, తెలంగాణ ప్రభుత్వ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, విష్ణువర్ధన్ రెడ్డి, అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు .మరోవైపు.. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శనివారం రాష్ట్ర సచివాలయంలో సుదర్శన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు సుదర్శన్ రెడ్డి. అలాగే, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర నేతలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

# మీ పిల్లలు ఆటిజంతో బాధపడుతున్నారా?

పేరు పెట్టి పిలిచినా పలకకపోవడం, ఐ కాంటాక్ట్ సరిగా లేకపోవడం, వారి వంక చూసి నవ్వినప్పుడు తిరిగి నవ్వకపోవడం వంటి లక్షణాలు ఆటిజం(మంద బుద్ధి) సమస్య ఉన్న పిల్లల్లో కనిపిస్తుంటాయి. పిల్లల్లో వయసుకు తగ్గట్టు మానసిక ఎదుగుదల లేకపోతే దాన్ని 'ఆటిజమ్'? అంటారు. ఇదొక నాడీ సంబంధ రుగ్మత అంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో ఆటిజం లక్షణాలు ఏంటి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం. ప్రపంచంలోని ప్రతి 68 మంది చిన్నారుల్లో ఒకరు ఆటిజం సమస్యతో బాధపడుతున్నారని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. ఎదుటివారి మాటల్నీ, హావభావాల్నీ అర్థం చేసుకోకపోవడం, మేధోవికాసం లేకపోవడం, చేసిన పనిని పదే పదే చేయడం, మాటలు మాట్లాడటంలో తడబాటు, ఉద్వేగాల్ని అదుపుచేయలేకపోవడం ఇలా అనేక సమస్యల్ని కలిపే ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ అంటారని అధ్యయనం పేర్కొంది. ఈ క్రమంలో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అర్థం చేసుకొని తగినంత ప్రోత్సాహం ఇస్తే ఆటిజమ్ పిల్లలు చాలా వరకు దీని నుంచి బయటపడే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. ఈ సమస్య ఆడపిల్లల్లో కన్నా మగపిల్లలకు ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. ముఖ్యంగా, తల్లిదండ్రులు చాలా ఆలస్యంగా సంతానాన్ని కనటం, కాన్పు సమయంలో మెదడుకు తగినంత ఆక్సిజన్ అందకపోవటం వంటి సమస్యలు ఎదుర్కొన్న వారికి దీని ముప్పు ఎక్కువగా ఉంటుందని పేర్కొంటున్నారు.

ఆటిజమ్‌ను నిర్థారించటానికి ఎలాంటి పరీక్షలు లేవని, దీన్ని లక్షణాలతో మాత్రమే గుర్తిస్తారంటున్నారు నిపుణులు. బాల్యంలో ప్రవర్తన, ఎదుగులలో మార్పులు వంటివి సమస్యను గుర్తించటానికి తోడ్పడతాయని చెబుతున్నారు. ఆటిజమ్‌తో బాధపడే పిల్లలు తొమ్మిది నెలల వయసు వచ్చినా తమ పేరుకు స్పందించకపోవచ్చని తెలియజేస్తున్నారు.



మూడేళ్ల వయసు వచ్చినా ఇతర పిల్లలతో కలవటానికి అంతగా ఇష్టపడరని వివరిస్తున్నారు. ఐదేళ్ల వయసుకు చేరుకున్నా ముఖంలో బాధ, సంతోషం వంటి భావాలనూ అంతగా ప్రదర్శించకపోవచ్చని వెల్లడిస్తున్నారు. కానీ, ఇలాంటి లక్షణాలను తల్లిదండ్రులు పెద్దగా పట్టించుకోకుండా, వారిని మరీ గారాబం చేస్తుంటారని చెబుతున్నారు. ఇలాంటి కీలకమైన ఎదుగుదల దశలో నిపుణుల సలహా తీసుకోవటం చాలా అవసరమంటున్నారు.. కొంత మంది పిల్లలు అతి చురుకుగానూ స్పందించవచ్చని, మరికొందరికి కుంగుబాటు, ఆందోళన వంటివీ ఉంచొచ్చని తెలియజేస్తున్నారు. వీటికి తగు చికిత్స ఇప్పించాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు.

ఆటిజం స్పెక్ట్రమ్ రుగ్మతకు చికిత్స లేదని, కానీ ప్రీస్కూల్ సంవత్సరాల్లోనే చికిత్స పొందడం వల్ల ఈ పరిస్థితి ఉన్న చాలా మంది పిల్లల జీవితాల్లో పెద్ద మార్పు వస్తుందని %ఝఎశీఓశ్రీఱఅఱఓ% అధ్యయనం పేర్కొంది. ప్రతి ఒక్కరికి వారి లక్షణాలను బట్టి ఆక్యుపేషనల్ థెరపీ, స్పీచ్ థెరపీ, బిహేవియర్ థెరపీ లాంటి చికిత్స ఉంటాయని, ఆయా చికిత్సల ద్వారా కచ్చితంగా మెరుగుదల కనిపిస్తుందని %ఎసఎ.స్త్ర.శీజ% అధ్యయనం పేర్కొంది. కానీ, తల్లిదండ్రులే శిక్షకులుగా మారాలని నిపుణులు సూచిస్తున్నారు.

**వారితో పోల్చకండి :** కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను ఇతర పిల్లలతో పోలుస్తుంటారు. వారిలాగా ఉండమని తమ పిల్లలకు చెబుతుంటారు. కానీ, ఇలా చేయడం వల్ల ఆటిజమ్ సమస్యలు తగ్గుతాయని అనుకుంటారు. అయితే, ఈ పద్ధతి ఏ మాత్రం మంచిది కాదంటున్నారు నిపుణులు. అలాగే, ఆటిజం ఉన్న వారిలో కూడా ఎన్నో నైపుణ్యాలు ఉంటాయని చెబుతున్నారు. ఎందుకంటే ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక నైపుణ్యం ఉంటుందని, దాన్ని గుర్తించి అందుకు తగ్గ తోడ్పటు అందించాలని సూచిస్తున్నారు. ఆటిజమ్ పిల్లలు పెద్దయ్యాక ఎలా ఉంటారన్నది తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, తోటి పిల్లల నుంచి లభించే ప్రోత్సాహాన్ని బట్టి ఆధారపడి ఉంటుందంటున్నారు నిపుణులు. కొందరు కొన్ని విషయాల్లో బాగా రాణిస్తుంటారని చెబుతున్నారు. సంగీతం, కంప్యూటర్లు, బొమ్మలు వేయటం వంటి వాటిపై ఎనలేని నైపుణ్యం ఉంటుందని పేర్కొంటున్నారు. అందువల్ల వీరిలో దాగిన నైపుణ్యాన్ని వెలికి తీయటానికి, మరింత సాన బెట్టటానికి ప్రయత్నం చేయాలని తెలియజేస్తున్నారు. %ఋూణ% ఉన్న పిల్లలలో బలహీనత స్థాయిలను తగ్గించడంలో ఆటల వినియోగం ప్రభావవంతంగా ఉంటుందని %దీవీజ% అధ్యయనం పేర్కొంది.

**కుదురు, ఏకాగ్రత :** ఆటిజమ్ పిల్లల్లో సమన్వయం, ఏకాగ్రత పెరగటానికి ఆటలు బాగా తోడ్పడతాయంటున్నారు నిపుణులు. వ్యక్తిగతంగా ఆడే పరుగు, ఈత వంటి ఆటలు మేలని చెబుతున్నారు. ఎందుకంటే వీటిల్లో ఇతరులతో సమన్వయం చేసుకోవాల్సిన అవసరం తక్కువగా ఉంటుందని, గెలిచామనే సంతోషమూ కలుగుతుందని వివరిస్తున్నారు. అదే ఫుట్?బాల్, క్రికెట్, బాస్కెట్?బాల్ వంటి ఆటలైతే ఎక్కువ మందితో కలిసి, ఆయా సందర్భాలకు అనుగుణంగా ఆడాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. మొదట్లో వీళ్లు ఆటటానికి వెనకాడొచ్చని, కానీ తల్లిదండ్రులు వెన్నుతట్టి ప్రోత్సహించాలని చెబుతున్నారు.

# డల్ స్కిన్ నుండి మిరుమిట్లు గొలిపే చర్మానికి మార్చడానికి ఉత్తమ చిట్కాలు



మీరు అద్దంలో చూసుకున్నప్పుడు మీ చర్మం కొద్దిగా కనపడుతుందని మీరు ఎప్పుడైనా భావించారా? అది తన స్పార్క్‌ని కోల్పోయినట్లే మరియు ఆ ప్రకాశవంతమైన కాంతిని ఉత్పత్తి చేయడానికి కష్టపడుతుందా? అది డల్ స్కిన్, మై బడ్డీ. ఇది నిరుత్సాహపరిచినప్పటికీ, ఇంకా ఆశ ఉంది! మీరు నిస్తేజాన్ని తొలగించవచ్చు మరియు నిస్తేజమైన చర్మానికి సరైన చర్మ సంరక్షణతో మీ చర్మాన్ని సహజంగా మార్చుకోవచ్చు .

నీరసానికి కారణమేమిటి? చర్మం నిస్తేజంగా మారడానికి అనేక కారణాలు ఉన్నాయి . అప్పుడప్పుడు, డెడ్ స్కిన్ సెల్స్ పేరుకుపోయి దుమ్ము పూతను పోలి ఉంటాయి, మీ చర్మం కాంతిని ప్రతిబింబించకుండా మరియు దాని స్వాభావిక ప్రకాశాన్ని ప్రదర్శించకుండా చేస్తుంది. పొడిబారడం కొన్నిసార్లు మీకు వ్యతిరేకంగా పని చేస్తుంది, మీరు పొడిగా మరియు నిస్తేజంగా కనిపించవచ్చు . కాలుష్యం మరియు సూర్యరశ్మితో సహా పర్యావరణ కారకాల కారణంగా మీ చర్మం నిస్తేజంగా మరియు నిర్జీవంగా మారవచ్చు. ప్రతి ఒక్కరూ డల్ స్కిన్‌ను పొందగలిగినప్పటికీ, కొన్ని చర్మ రకాలు ఇతరులకన్నా ఎక్కువ హాని కలిగిస్తాయి. పోషణ మరియు బొద్దుగా ఉండే సహజ నూనెలు లేకపోవడం వల్ల పొడి, నిస్తేజమైన చర్మం తరచుగా నిస్తేజంగా ఉంటుంది. అయితే, డెడ్ స్కిన్ సెల్స్ ఉపరితలంపై పేరుకుపోతే, జిడ్డు చర్మం కూడా అప్పుడప్పుడు నిర్జీవంగా అనిపించవచ్చు. ప్రతి చర్మ రకం ఈ నివారణల నుండి ప్రయోజనం పొందవచ్చు! మీకు కావాల్సిన కాంతివంతమైన, మెరిసే చర్మాన్ని పొందడంలో మీకు సహాయపడటానికి, మేము కొన్ని అద్భుతమైన చర్మ సంరక్షణ ఉత్పత్తులను సూచిస్తాము, ఉదాహరణకు ఉబ్టాన్ ఫోమింగ్ ఫేస్ వాష్ ఫర్ గ్లోయింగ్ స్కిన్ , విటమిన్ సి ఫేస్ క్రీమ్ స్కిన్ బ్రైటెనింగ్ మరియు మాయిశ్చరైజింగ్ మరియు 99% ప్యూర్ అలోవెరా జెల్. చర్మం . మెరుస్తున్న చర్మం అంతిమంగా మీ చర్మంలో సుఖంగా మరియు సురక్షితంగా ఉండటమే కాకుండా అందంగా కనిపించడం గురించి కాదు.

డెడ్ స్కిన్ సెల్స్, డ్రైనెస్ మరియు ఎన్విరాన్‌మెంట్ కారకాల వల్ల డల్ స్కిన్‌కి కాంతి ఉండదు. ప్రధాన సంకేతాలు ఫ్లాట్ రూపాన్ని మరియు కఠినమైన ఆకృతిని కలిగి ఉంటాయి. ఉబ్టాన్ ఫేస్ వాష్ మరియు విటమిన్ సి క్రీమ్ వంటి ఉత్పత్తులతో దీనిని పరిష్కరించండి. సాధారణ చర్మ సంరక్షణ నియమావళి ఆరోగ్యకరమైన చర్మాన్ని నిర్వహించడానికి మరియు సాధారణ చర్మ సమస్యలను నివారించడానికి సహాయపడుతుంది. టోనింగ్, మాయిశ్చరైజింగ్ మరియు క్లీనింగ్ అన్నీ నియమావళిలో భాగంగా ఉండాలి. చర్మం యొక్క %జూస% బ్యాలెన్స్‌ను పునర్నిర్మించడంలో టోనింగ్ సహాయం చేస్తుంది, శుభ్రపరచడం చెత్తను మరియు నూనెను తొలగిస్తుంది మరియు మాయిశ్చరైజింగ్ చర్మాన్ని తేమగా ఉంచుతుంది. ఏదైనా చర్మ సంరక్షణ నియమావళిలో శుభ్రపరచడం మొదటి దశ. మనందరికీ తెలిసినట్లుగా, ఇది శిథిలాలు, నూనె మరియు బ్యాక్టీరియా యొక్క చర్మాన్ని క్లియర్ చేయడం ద్వారా మొటిమలు మరియు ఇతర చర్మ సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది. ఎక్స్‌ఫోలియేషన్ డెడ్ స్కిన్ సెల్స్‌ను తొలగించడం ద్వారా సెల్ టర్నోవర్‌ను ప్రోత్సహిస్తుంది మరియు మృదువైన, మరింత కాంతివంతమైన చర్మాన్ని అందిస్తుంది. ప్రకాశవంతమైన చర్మం కోసం ఉత్తమమైన మాయిశ్చరైజర్ చర్మాన్ని హైడ్రేట్ చేస్తుంది మరియు నీరసం మరియు పొడిని నివారించడంలో సహాయపడుతుంది. బాగా, మెరిసే చర్మానికి మీరే హైడ్రేట్ చేసుకోవడం చాలా అవసరం. కాంతివంతమైన చర్మ సంరక్షణ కోసం మనం రోజూ ఏడు ఔన్సుల నీటిని తాగాలని సైన్స్ సూచిస్తోంది . రేడియేషన్ ముడతలు, నల్లటి పాచెస్ మరియు చర్మ క్యాన్సర్‌తో సహా చర్మ పరిస్థితులకు కారణమవుతుంది. అయినప్పటికీ, ఇది చర్మ కణాలను దెబ్బతీయడం మరియు కొత్త కణాల పునరుద్ధరణ మరియు పునరుత్పత్తికి ఆటంకం కలిగించడం ద్వారా చర్మాన్ని నిస్తేజంగా

# ధరల సెగతో తగ్గిన పసిడి డిమాండ్



**ముంబై:** అధిక బంగారం ధరలు ఆ లోహం డిమాండ్‌ను భారీగా దెబ్బతీశాయి. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో బంగారం డిమాండ్‌లో 16 శాతం క్షీణతతో 209.4 టన్నులకు పడిపోయిందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ (డబ్ల్యుజిసి) గురువారం ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. ఆభరణాల డిమాండ్ పరిమాణంలో 31 శాతం క్షీణత చోటు చేసుకుంది. మరోవైపు నాణేలు, బార్ల కోసం పెట్టుబడి డిమాండ్ 20 శాతం పెరిగింది.

అభరణాల డిమాండ్ 31 శాతం పతనమై 117.7 టన్నులుగా నమోదయ్యింది. అధిక ధరల నేపథ్యంలో ప్రజలు తక్కువ బరువు, తక్కువ స్వచ్ఛత కలిగిన అభరణాలను కొనుగోలు చేశారు. ఏడాదికేడాదితో పోల్చితే సెప్టెంబర్ త్రైమాసికంలో బంగారం దిగుమతులు 37 శాతం పతనమై 194.6 టన్నులుగా నమోదయ్యింది. రీసైక్లింగ్ 7 శాతం తగ్గి 21.8 టన్నులుగా చోటు చేసుకుంది. వినియోగదారులు తమ పసిడిని నిలకడగా పెట్టుకోవడమే రీసైక్లింగ్ తగ్గడానికి కారణమని డబ్ల్యుజిసి పేర్కొంది.

"పెట్టుబడుల డిమాండ్ 74 శాతం పెరిగి 91.6 టన్నులుగా నమోదయ్యింది. ఈ విలువ రూ.88.970 కోట్లుగా ఉంటుంది. పసిడిపై దీర్ఘకాలంలో ఉన్న మక్కువ, విలువను దృష్టిలో పెట్టుకుని కొనుగోళ్లు జరిపారు." అని డబ్ల్యుజిసి ఇండియా రీజినల్ సిఇఒ సచిన్ జైన్ పేర్కొన్నారు.

'స్వల్పకాలంలో బంగారం ధరలు రూ.1,18,000 నుండి రూ.1,24,500 మధ్య అస్థిరంగా ఉండొచ్చని ఎల్‌కెపి సెక్యూరిటీస్ నిపుణుడు జతీన్ త్రివేది తెలిపారు. ధనతేరస్, దీపావళి సమయంలో వినియోగదారుల రాక సుమారు 15 శాతం పెరగడంతో డిసెంబర్ త్రైమాసికంలో ఆభరణాల డిమాండ్ కోలుకుంటుందని బులియన్ వర్గాల అంచనా. గురువారం 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారం ధర రూ.1,19,620గా నమోదయ్యిందని ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ (ఐబిజెఎ) తెలిపింది. ఇంతక్రితం రోజు రూ.1,19,350గా పలికిందని పేర్కొంది. ఇటీవల బంగారం ధరలు ఓ దశలో ఆల్‌టైం రికార్డ్ గరిష్టాలను తాకిన విషయం తెలిసిందే. 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారం ధర రూ.1.32 లక్షలకు చేరి వినియోగదారులను హడల్ ఎత్తించిన విషయం తెలిసిందే.

# తిరోగమన జాతీయ కార్మిక విధానం



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** కేంద్ర మోడీ ప్రభుత్వం జాతీయ కార్మిక, ఉపాధి విధానం ముసాయిదాను ప్రకటించింది. దీనిని భాగస్వాముల కోసం చర్చకు, స్పందనకు పెట్టింది. ఈ విధానాన్ని సిఐటియు వ్యతిరేకిస్తూ కేంద్ర కార్మిక మంత్రికి లేఖ రాసింది. జాతీయ కార్మిక, ఉపాధి విధానం ఖరారు కావడానికి ముందుగా వెంటనే భారత కార్మిక మహాసభను సమావేశపరిచి, త్రైపాక్షిక యంత్రాంగంగా ఉన్న ఆ మహాసభలో చర్చించి ఏకాభిప్రాయానికి రావాలని కోరింది. ఇతర కార్మిక సంఘాలతో కలిసి ఐక్యంగా కూడా ఈ డిమాండ్‌ను లేవనెత్తే అవకాశం ఉంది. జాతీయ కార్మిక విధానం అమల్లోకి వస్తే వివిధ సంస్థల రూపురేఖలే మారిపోయే ప్రమాదం పొంచి ఉంది. ఇందులో ముఖ్యంగా కార్మిక ఉపాధి మంత్రిత్వశాఖ ఇకనుండి నియంత్రణ, తనిఖీల నుండి జాతీయ ఉపాధి సహాయకునిగా మారుతుంది. భారత కార్మిక మహాసభ స్థానంలో మంత్రిత్వ శాఖలు, రాష్ట్రాలు, పారిశ్రామిక మరియు కార్మిక సంఘాలను సంవత్సరానికోసారి ఒకే వేదికల మీదకు తీసుకువచ్చే సమావేశాలు జరుగుతాయి. పరిశ్రమలు, ప్రభుత్వాలు, కార్మికుల గ్రూపులకు సమాన ప్రాతినిధ్యం విస్మరించబడుతుంది. కార్మిక వ్యతిరేక పక్షపాతం చూపించబడుతుంది. లేబర్ మార్కెట్ సంస్కరణలు ఏవైతే ఇప్పుడు అమలులోకి వచ్చాయో లేదా రాబోతున్నాయో వాటికి అవసరమైన సంస్థాగత ఏర్పాటును జాతీయ కార్మిక విధానం రూపొందించింది. దేశ స్థాయిలో జాతీయ కార్మిక, ఉపాధి విధాన అమలు కౌన్సిల్ ఏర్పడుతుంది. పని అనుసంధానానికి మంత్రిత్వ శాఖల గ్రూపులు ఏర్పడతాయి. రాష్ట్ర స్థాయిలో కార్మిక ఉపాధి మిషన్, జిల్లా స్థాయిలో కార్మిక వనరుల కేంద్రాలు ఉంటాయి. దేశస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు కూడా పరిశ్రమలకు కావలసిన కార్మికులను సమకూర్చే కేంద్రాలుగా ఇవి ఉంటాయి మినహా కార్మిక చట్టాలను అమలు చేసే కేంద్రాలుగా ఇవి పనిచేయవు.

పురాతన ధర్మశాస్త్రాలకు ప్రతిరూపమైన మనుస్మృతిని జాతీయ కార్మిక విధానం ఆదర్శంగా తీసుకుంది. పురాతన కాలంలో శూద్రులుగా ఉన్న శ్రామికులను దోపిడీ చేయడానికి, అణచిపెట్టడానికి మనుస్మృతి ఏ విధంగా తోడ్పడిందో అదే విధంగా ప్రస్తుత కాలంలో జాతీయ కార్మిక విధానం ఎటువంటి ఆటంకాలు లేకుండా కార్మిక శ్రమకు ఎటువంటి రక్షణ లేకుండా చేసి చౌకగా కొల్లగొట్టే ఏర్పాట్లు చేసింది. కానీ అదే సమయంలో తేనె పూసిన మాటలు కొన్ని చెప్పింది. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులైన సమానత్వ హక్కు, వివక్షత లేని సమాన అవకాశాలు, అసోసియేషన్లు, యూనియన్లు పెట్టుకునే స్వేచ్ఛ గురించి మాట్లాడింది. శ్రమకు గౌరవం, మానవత్వంతో కూడిన పని పరిస్థితులు, ఇంకా ముఖ్యంగా ఉన్నత దశలో ఉన్న జీవన వేతనం గ్యారంటీని పేర్కొంది.

కానీ జాతీయ కార్మిక విధానం ఎక్కడా కూడా కార్మికులు ఎదుర్కొంటున్న అమానవీయ పరిస్థితులను సమీక్షించలేదు అనడం కంటే సమీక్షించదలుచుకోలేదు అనడం మంచిది. కార్మిక చట్టాలను అమలు చేయించేందుకు అవసరమైన తనిఖీలను పాలకులు నిలిపివేశారు. యూనియన్లు పెట్టుకుంటే కార్మికులను, నాయకులను తొలగిస్తున్నారు. చట్ట ప్రకారం సమ్మె చేసినా కార్మికులకు యజమానులు ఉద్వాసన చెబుతున్నారు. చట్ట ప్రకారం 8 గంటలు పని చేయాల్సి ఉన్నా, కార్మికులతో బలవంతంగా 10, 12 గంటల పాటు పని చేయించుకుంటున్నా కూడా, వారిని రక్షించే పనిలో కార్మిక శాఖ లేదు.

జాతీయ కార్మిక విధానం లేబర్ కోడ్స్‌ను సమర్ధించింది. మెజార్టీ కార్మికులను కార్మిక చట్టాల పరిధి నుండి తొలగించిన లేబర్ కోడ్స్‌ను ఒకపక్క సమర్థిస్తూ, మరోపక్క సార్వత్రికంగా కార్మికులందరినీ కలుపుకు పోతామని బొంకింది. ఎటువంటి కార్మిక హక్కులను పొందేందుకు సాహసించలేని నిర్ధారిత కాల ఉద్యోగాలను ప్రవేశపెట్టిన, కార్మికులను అతి తేలిగ్గా తొలగించే అధికారాలు ఇచ్చిన లేబర్ కోడ్స్‌ను సమర్థిస్తూ, మరోపక్క మానవీయతతో కూడిన పని పరిస్థితుల గురించి మాట్లాడి మభ్యపెట్టింది.

ఇప్పటికే తనిఖీలు లేకుండా చేసిన విధానాన్ని జాతీయ కార్మిక విధానం సమర్ధించింది. ఫిర్యాదుల ఆధారంగా చట్టాల అమలు స్థానంలో, ఫలితాల ఆధారిత అమలును ప్రతిపాదించింది. అంటే, ఉదాహరణకి ఫార్మా లేదా రసాయనిక పరిశ్రమల్లో ప్రమాదం జరిగితే అక్కడ అప్పుడు నియమాలను పాటించకపోవడంపై తనిఖీ ఉంటుంది మినహా, ముందుగా తనిఖీలు ఉండబోవనే ఈ విధానం పరోక్షంగా స్పష్టం చేసింది. సామాజిక భద్రతా పథకాల విలీనాన్ని జాతీయ కార్మిక విధానం ప్రతిపాదించింది. ఇ.పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ, ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన, జాతీయ ఉపాధి కల్పన సర్వీసులు (ఎన్.సి.ఎస్), ఈ-శ్రమ పథకాలను మిళితం చేస్తుంది. మిళితం కాబడిన సామాజిక భద్రతా పథకానికి కార్మికుల నుండే నిధులు సమకూరుతాయి. పథకాలకు బడ్జెట్ నుండి ప్రభుత్వం నిధులు కేటాయించదు. కొత్త పెన్షన్ పథకం మాదిరిగానే మొత్తం సామాజిక భద్రత మారిపోతుంది. కొత్త పెన్షన్ పథకం (న్యూ పెన్షన్ స్కీం)లోకి ఏ విధంగా సిపిఎస్ తదితర రూపాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, బ్యాంకు-ఇన్సూరెన్స్ ఉద్యోగులు, అసంఘటిత కార్మికులు తాము చెల్లించే నిధులతో ఏకం చేయబడ్డారో కార్మిక, ఉద్యోగ వర్గాలు తాము చెల్లించే నిధులతోనే సామాజిక భద్రతా పథకంలో ఏకం చేయబడతారు. ప్రభుత్వాలకు, యాజమాన్యాలకు బాధ్యత లేకుండా పోతుంది.




## నేడే మహిళల వరల్డ్ కప్ ఫైనల్

# విజయం ఎవరిని వరిస్తుందో?



మహిళల వన్డే ప్రపంచ కప్ 2025 చివరి అంకానికి చేరుకుంది. ఆదివారం నవీ ముంబై వేదికగా జరగనున్న ఫైనల్‌తో ఈ మెగా టోర్నీకి తెరపడనుంది. టైటిల్ పోరుకు సౌతాఫ్రికా, టీమిండియా అర్హత సాధించాయి. తొలి సెమీస్‌లో ఇంగ్లండ్‌ను చిత్తు చేసి సౌతాఫ్రికా నేరుగా ఫైనల్‌లో అడుగు పెట్టింది. రెండో సెమీస్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఆసీస్‌ను భారత్ చిత్తు చేసింది. 339 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి సంచలన విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఫైనల్‌కు వర్షం ముప్పు..

అయితే ఆదివారం జరిగే ఫైనల్ మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉంది. భారీ వర్షం లేకున్నా.. చిరు జల్లులు ఆటకు అంతరాయం కలిగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గురువారం జరిగిన రెండో సెమీస్‌లో ఉన్న చిరు జల్లులు పడ్డాయి. కానీ మ్యాచ్‌కు ఎలాంటి అంతరాయం కలగలేదు. కానీ ఆదివారం 30-60శాతం వర్షం పడే ఛాన్స్ ఉందని అక్కడ వాతావరణ శాఖ వెల్లడించింది.

వర్షం వల్ల ఆదివారం కనీసం 20 ఓవర్ల ఆట సాధ్యం కాకపోతే సోమవారానికి రిజర్వ్ డే ప్రకటిస్తారు. ఆగిపోయిన ఓవర్ల నుంచే ఆటను కొనసాగిస్తారు. ఒకసారి టాస్ పడిదంటే.. ఆ మ్యాచ్ లైవ్‌గానే పరిగణిస్తారు. అయితే సోమవారం కూడా వర్షం పడే అవకాశం ఉంది. ఒకవేళ రిజర్వ్ డే కూడా ఆట సాధ్యం కాకపోతే ఐసీసీ రూల్ ప్రకారం ఇరు జట్లను విజేతగా ప్రకటిస్తారు. రెండు రోజుల్లో డక్‌వర్త్ లూయిన్ పద్ధతిలో ఇరు జట్లు కనీసం 20 ఓవర్ల ఆట ఆడేలా చూస్తారు. అది కూడా సాధ్యం కాకపోతేనే మ్యాచ్‌ను రద్దు చేస్తారు. కానీ మహిళల వన్డే ప్రపంచ కప్ 2025 టోర్నీ ఫైనల్‌కు అలాంటి పరిస్థితి అయితే లేదు.

బలమైన ఆసీస్‌ను ఓడించి ఫైనల్ చేరిన టీమిండియా ఆత్మవిశ్వాసం రెట్టింపు అయింది. ఫైనల్‌లో సౌతాఫ్రికాను ఓడించడం అంత కష్టమేమీ కావచ్చు. సెమీస్ తరహాలోనే సమష్టిగా రాణిస్తే విజయం సాధించొచ్చు. క్రీజులో సెట్ అయిన బ్యాటర్ ఆఖరి వరకు ఉండాలి. కట్టడిగా బౌలింగ్ చేయాలి. అంతే పదునుగా ఫీల్డింగ్ ఉండాలి. సమష్టిగా ఉన్నప్పుడు జట్టుకు గెలుపు పెద్ద కష్టమేమీ కాదు. మరోవైపు సౌతాఫ్రికా కూడా ఇప్పటి వరకు వన్డే ప్రపంచకప్ గెలవలేదు. ఆ జట్టు కూడా తొలి టైటిల్ కోసం గట్టిగా పోరాడనుంది. సౌతాఫ్రికా జట్టు గ్రూప్ దశలో 7 మ్యాచ్‌లలో 5 గెలిచి సెమీఫైనల్ చేరగా.. భారత్ జట్టు మాత్రం 7 మ్యాచ్‌ల్లో 3 గెలిచి 3 ఓడింది. ఒక మ్యాచ్ వర్షంతో రద్దయ్యింది. సౌతాఫ్రికా జట్టులో కెప్టెన్ లారా వోల్వార్ట్ అద్భుతమైన ఫామ్‌లో ఉండగా.. టీమిండియాలో స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్‌తో పాటు, యువ ఆటగాళ్ల నిలకడైన ప్రదర్శన టీమిండియాకు ప్రధాన బలంగా మారింది. సొంత మైదానంలో ప్రేక్షకుల మద్దతు కూడా భారత జట్టుకు గొప్ప ప్రేరణ అవుతుంది. అంతేకాకుండా నవీ ముంబై వేదికగానే గత నాలుగు మ్యాచ్‌లను భారత్ ఆడటం కలిసొచ్చే అంశం.

# ప్రొ కబడ్డీ టైటిల్ విజేత దబాంగ్ ఢిల్లీ



ప్రొ కబడ్డీ సీజన్-12 టైటిల్‌ను దబాంగ్ ఢిల్లీ కైవసం చేసుకుంది. త్యాజరాజ్ స్టేడియంలో జరిగిన ఫైనల్లో ఢిల్లీ జట్టు 31-28పాయింట్ల తేడాతో పుణేరి పల్టన్స్‌ను చిత్తు చేసింది. తొలి అర్ధభాగం ముగిసేసరికి కేవలం 2పాయింట్లు ఆధిక్యతను సంపాదించిన ఢిల్లీ రెండో అర్ధభాగంలో ఆచి తూచి ఆడింది. మ్యాచ్ ముగియడానికి 40 సెకన్ల ముందు 29-28పాయింట్లతో పుణేరి జట్టు ఢిల్లీకి చేరువ కాగా.. రైడ్‌కు వెళ్లిన పుణేరి రైడర్ ఆదిత్య షిండేను ఢిల్లీ జట్టు ట్యాకిల్ చేయడం ఫలితం ఢిల్లీవైపు మొగ్గింది.

హోరాహోరీగా సాగిన ఈ పోటీలో ఢిల్లీ రైడర్లు నీరజ్(9), అజింక్యా పవార్(6), ఆషు మాలిక్(2)కి తోడు డిఫెండర్లు సుర్జీత్, సౌరభ్ నందన్, ఫజల్ అత్రాచేలి రాణించాడు. ఇక పుణేరి జట్టులో ఆదిత్య షిండే(10), పంకజ్ మోహిత్(4) డిఫెండర్ గౌరవ్(3) రాణించారు. దీంతో దబాంగ్ ఢిల్లీ జట్టు రెండోసార్లు ప్రొ కబడ్డీ టైటిల్‌ను చేజిక్కించుకుంది. తొలిసారి 2021-22తో దబాంగ్ ఢిల్లీ జట్టు టైటిల్‌ను సాధించింది.




# శరవేగంగా చరణ్ 'పెద్ది' షూటింగ్



రామ్ చరణ్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న గ్రామీణ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది'. బుచ్చిబాబు సాన దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ప్రస్తుతం శ్రీలంకలో షూటింగ్‌లో ఉంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించి క్రేజీ అప్‌డేట్‌ను దర్శకుడు షేర్ చేశారు. ఆస్కార్ విజేత, సంగీత దిగ్గజం ఏఆర్ రెహమాన్ నవంబర్ 8న రామోజీ ఫిల్మ్ సిటీలో నిర్వహించే 'ది వండర్‌మెంట్ హైదరాబాద్' మ్యూజిక్ కాన్సర్ట్‌లో 'పెద్ది' సినిమా ఫస్ట్ సింగిల్ విడుదల కాబోతుందని వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఈ వార్తలకు బలం చేకూరుస్తూ.. బుచ్చిబాబు తాజాగా ఒక పోస్ట్ పెట్టారు.

ఈ పోస్ట్‌లో 'రెహమాన్ కన్సర్ట్ కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నా. ఆరోజు పెద్ది కూడా అప్‌డేట్ ఉండబోతుంది. అప్పటివరకు వెయిట్ చేయడం'టూ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. ఈ చిత్రంలో కన్నడ నటుడు శివరాజ్‌కుమార్, సీనియర్ నటుడు జగపతి బాబు, బాలీవుడ్ నటుడు దివ్యేందు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 మార్చి 27న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుంది.

# ఉత్కంఠ రేపుతున్న 'శంబాల' ట్రైలర్



యువ హీరో ఆది సాయికుమార్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'శంబాల.. ఏ మిస్టిక్ వరల్డ్'. సూపర్ నాచురల్ హారర్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా నుంచి మేకర్స్ తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఉత్కంఠభరితమైన సన్నివేశాలతో కూడిన ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ 25న క్రిస్మస్ కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ప్రకటించారు.

ట్రైలర్‌ను గమనిస్తే, "కొన్ని వేల సంవత్సరాల క్రితం పరమశివుడికి, అసురుడికి మధ్య జరిగిన భీకర యుద్ధం ఈ కథకి మూలం" అంటూ నటుడు సాయికుమార్ గంభీరమైన వాయిస్ ఓవర్‌తో ప్రారంభమైంది. ఆకాశం నుంచి ఓ ఉల్క లాంటి రాయి భూమిపై ఒక గ్రామంలో పడటం, ఆ తర్వాత నుంచి అక్కడి ప్రజలు వింతగా ప్రవర్తించడం వంటి అంశాలు కథలో కీలకమైనవిగా తెలుస్తోంది.

ఈ చిత్రంలో ఆది సాయికుమార్ ఒక భౌగోళిక శాస్త్రవేత్త (జియాలజిస్ట్) పాత్రలో కనిపించనున్నారు. ఆ ఊరిలో జరుగుతున్న వింత పరిణామాల వెనుక ఉన్న రహస్యాన్ని ఛేదించి, ప్రజలను ఎలా కాపాడారనేదే ఈ సినిమా కథాంశం. తన కెరీర్‌లో ఇదొక ఛాలెంజింగ్ పాత్ర అని తెలుస్తోంది.

యుగంధర్ ముని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో అర్చన అయ్యర్, స్వాసిక్ హీరోయిన్‌లుగా నటిస్తున్నారు. రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. విభిన్నమైన కథాంశంతో వస్తున్న ఈ సినిమాతో ఆది సాయికుమార్ మంచి విజయాన్ని అందుకుంటారని చిత్రబృందం ధీమా వ్యక్తం చేస్తోంది.






## 52వ పుట్టినరోజు జరుపుకుంటున్న
# ఐశ్వర్య రాయ్



సౌందర్యరాశి ఐశ్వర్య రాయ్ బచ్చన్... ఈ పేరు వినగానే అందం, హుందాతనం గుర్తుకొస్తాయి. 1994లో ప్రపంచ సుందరి కిరీటం గెలుచుకున్న నాటి నుంచి నేటి వరకు, ఆమె గ్రేస్ ఏమాత్రం తగ్గలేదు. ఈరోజు (నవంబర్ 1) తన 52వ పుట్టినరోజు జరుపుకుంటున్న సందర్భంగా, దశాబ్దాలుగా చెక్కుచెదరని ఆమె సౌందర్య రహస్యాలపై సర్వత్ర ఆసక్తి నెలకొంది. ఒక నటిగా, తల్లిగా, గ్లోబల్ ఐకాన్‌గా బహుళ పాత్రలు పోషించే ఐశ్వర్య తన దినచర్య గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. "సాధారణంగా అందరికీ రోజుకు 24 గంటలుంటే, నేను మాత్రం 48 గంటల పనిని అందులో పూర్తి చేయాల్సి ఉంటుంది" అని ఆమె గతంలో ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. తన రోజు ప్రతిరోజూ ఉదయం 5:30 గంటలకే మొదలవుతుందని చెప్పారు. ఇంత బిజీ షెడ్యూల్‌లోనూ ఆమె అందం ఎలా మెరిసిపోతుందని చాలామంది ఆశ్చర్యపోతుంటారు. అయితే, దీని వెనుక పెద్దగా ఖరీదైన ఉత్పత్తులు గానీ, సుదీర్ఘమైన స్కిన్‌కేర్ రొటీన్లు గానీ లేవని ఐశ్వర్య స్పష్టం చేశారు. "ప్రతి మహిళలాగే నేనూ సమయంతో పోటీ పడుతుంటాను. నా దృష్టిలో అందంగా కనిపించడానికి ముఖ్యమైనవి రెండే. ఒకటి శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోవడం, రెండోది పరిశుభ్రంగా ఉండటం" అని ఆమె వివరించారు. ఈ రెండూ పాటిస్తే చర్మం దానంతట అదే ఆరోగ్యంగా కనిపిస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు.

దీంతో పాటు, మాయిశ్చరైజింగ్ తన జీవితంలో ఒక భాగమైపోయిందని ఐశ్వర్య తెలిపారు. "సినిమా రంగంలోకి అడుగుపెట్టిన తొలినాళ్ల నుంచే మాయిశ్చరైజింగ్ చేయడం అలవాటైంది. అది ఇప్పుడు నా దినచర్యలో సహజమైన భాగం. రోజు మొదట్లో, ముగింపులో తప్పనిసరిగా మాయిశ్చరైజర్ వాడతాను" అని ఆమె పేర్కొన్నారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**